


'రాజముద్ర' తెలుగు దినపత్రికలో
ప్రకటనల కోసం సంప్రదించగలరు
సెల్ : 9182 474 575



www.rajamudranews.com

# అక్షర రాజముద్ర

ప్రతి అక్షరం - ప్రజల కోసం | తెలుగు దిన పత్రిక

AKSHARA RAJAAMUDHRA | RNI No: TELTEL/2024/86684

| మేడ్చల్-మల్కాజ్‌గిరి | గురువారం | 22.01.2026 | సంపుటి : 2 | సంచిక :346 | పేజీలు : 8 | వెల : 2/- |
|---|---|---|---|---|---|---|
| MEDCHAL-MALKAJGIRI | Thursday | 22.01.2026 | volume : 2 | Issue : 346 | Pages : 8 | Cost : 2/- |



**విలేకరులు కావలెను**

'రాజముద్ర' తెలుగు దినపత్రికలో పని చేయుటకు జిల్లాలు మరియు మండలాల వారీగా రిపోర్టర్లు కావలెను. తెలుగు భాషలో ప్రావీణ్యం, ప్రజా సమస్యలపై పోరాట స్ఫూర్తి, సమస్యలపై గళమెత్తగల వ్యక్తిత్వం, కలంతో ప్రశ్నించే ధైర్యం ఉన్నవారికి ఆహ్వానం పలుకుతోంది.

సంప్రదించాల్సిన చిరునామా..

సెల్ : 9182 474 575




06

## సునీతా విలియమ్స్ రిటైర్మెంట్



06

## నన్ను చంపేస్తే.. మీరు భూమ్మీదే ఉండరు

ఇరాన్‌కు ట్రంప్ వార్నింగ్



07

## పసిడి పరుగులు..

ఒక్కరోజే రూ.9వేలకు పైగా..

### దావోస్ సదస్సుకు ఫాలో అప్

# హైదరాబాద్ సదస్సు

**వరల్డ్ ఎకనమిక్ ఫోరమ్‌లో సిఎం రేవంత్ ప్రతిపాదన**

వివిధ సంస్థలతో చర్చలు..ఎంవోయూలు

వేయికోట్ల పెట్టుబడులకు సర్గడ్ సంస్థతో ఎంవోయు

హైదరాబాద్‌లో రీసెర్చ్ సంస్థ ఏర్పాటుకు బ్లైజ్ అంగీకారం

రష్మీ గ్రూప్ 12500 కోట్లతో స్టీల్ ప్లాంట్ ఏర్పాటు



వరల్డ్ ఎననామిక్ ఫోరం ఫాలోఅప్ సదస్సును ఏటా నిర్వహించాలని తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి ప్రతిపాదించారు. దావోస్‌లో జరుగుతున్న సదస్సులో ఆయన ఈ అంశాన్ని ప్రస్తావించారు. ప్రతి సంవత్సరం జులైలో హైదరాబాద్‌లో దీన్ని నిర్వహించాలని కోరారు. సీఎం ప్రతిపాదనకు గ్లోబల్ బిజినెస్ లీడర్లు, పాలసీ నిర్ణేతలు మద్దతు తెలిపారు. ఇదిలావుంటే వివిధ కంపెనీల ప్రతినిధులతో భేటీ అయిన సిఎం రేవంత్ పలు రంగాల్లో పెట్టుబడులకు సంబంధించి ఒప్పందాలు కుదుర్చుకున్నారు.

స్విట్జర్లాండ్‌లోని దావోస్‌లో జరుగుతున్న వరల్డ్ ఎకనామిక్ ఫోరమ్ 2026 సదస్సు సందర్భంగా అమెరికాకు చెందిన సర్గడ్ సంస్థతో తెలంగాణ ప్రభుత్వం కీలక అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. ప్రపంచ ఆర్థిక సదస్సులో సీఎం రేవంత్ రెడ్డితో ఆ సంస్థ సీఈఓ భేటీ అయ్యారు. ఈ సందర్భంగా తెలంగాణలో మెయింటెనెన్స్, రిపేర్ అండ్ ఓవర్‌హాల్ యూనిట్‌ను ఏర్పాటు చేసేందుకు ఆ సంస్థ ముందుకు వచ్చింది. రాబోయే 3 నుంచి 5 సంవత్సరాల్లో రూ.1,000 కోట్ల పెట్టుబడులకు రాష్ట్ర ప్రభుత్వంతో ఒప్పందం కుదుర్చుకుంది.

హైదరాబాద్, జనవరి 21 : ఈ ఎమ్ఆర్ఓ కేంద్రాన్ని వరంగల్ లేదా ఆదిలాబాద్‌లో ఏర్పాటు చేసేందుకు ప్రణాళికలు సిద్ధమవుతున్నాయి. దీంతో రాష్ట్రం.. విమానయాన, ఏరోస్పేస్ రంగాల్లో మరింత బలోపేతమయ్యే అవకాశం

-మిగతా 2 లో..

### స్థానిక సమస్యల

# ఆధారంగానే ప్రజల తీర్పు

## మున్సిపల్ ఎన్నికలకు మేం సిద్ధం

**కాంగ్రెస్‌కు ఓటేస్తే జిల్లాలు ఎత్తేయడం ఖాయం**

**బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్**



మున్సిపల్ ఎన్నికలకు బీఆర్ఎస్ పార్టీ సిద్ధంగా ఉందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ స్పష్టం చేశారు. కాంగ్రెస్‌కు ఓటేస్తే జిల్లాలు ఎత్తివేయటం ఖాయమని కేటీఆర్ హెచ్చరించారు. స్థానిక సమస్యల ఆధారంగానే మున్సిపల్ ఎన్నికల్లో ఓటు వేస్తారని.. ఫార్ములా ఈ, ఫోన్ ట్యాపింగ్ జరిగినట్లు ఆధారాలు చూపలేక పోయారని అన్నారు. ఫార్ములా ఈ కేసులో దోషులుగా చెప్తోన్న గ్రీన్ కోతో దావోస్‌లో రేవంత్ చర్చలు జరుపుతున్నారని అన్నారు.

హైదరాబాద్, జనవరి 21 : మున్సిపల్ ఎన్నికల్లో కేసీఆర్, నేను ప్రచారం చేసేదేమీ ఉండదని.. సర్పంచ్ ఎన్నికల్లో ముఖ్యమంత్రి ప్రచారం చేసినా కాంగ్రెస్ సాధించింది ఏమీ లేదని అన్నారు. తెలంగాణ భవన్‌లో మీడియాతో చిట్‌చాట్‌లో కేటీఆర్ మాట్లాడుతూ.. పంచాయతీ ఎన్నికల్లో 40 శాతం సర్పంచులను గెలిచామని.. మున్సిపల్ ఎన్నికల్లో కూడా మెజారిటీ సీట్లు

-మిగతా 2 లో..

### మున్సిపల్ ఎన్నికల వేళ

## 47 మంది కమిషనర్ల బదిలీ

**తక్షణం విధుల్లో చేరాలని ఆదేశం**

హైదరాబాద్, జనవరి 21 : మున్సిపల్ ఎన్నికలకు ముందు పలువురు కమిషనర్లను ప్రభుత్వం బదిలీ చేసింది. తెలంగాణలో మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం బదిలీలు చేపట్టింది. ఏకంగా 47 మంది మున్సిపల్ కమిషనర్లను బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. తక్షణమే విధుల్లో చేరాలని అధికారులకు ఆదేశాలు ఇచ్చింది. ప్రభుత్వ ఆదేశాలను పాటించకపోతే క్రమశిక్షణా

-మిగతా 2 లో..

### నిజామాబాద్ మున్సిపల్ ఎన్నికల్లో

# కాంగ్రెస్ జెండా ఎగరేస్తాం

**రాముడి పేరు చెప్పకుండా ఎన్నికల్లో నిలబడగలరా**

**టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్**

శ్రీరాముడి పేరు చెప్పకుండా ఎన్నికల్లో నిలబడే దమ్ము బీజేపీకి ఉందా అని టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ ప్రశ్నించారు. నిజామాబాద్ మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ జెండా ఎగరడం ఖాయమని.. కాంగ్రెస్ తోనే నిజామాబాద్ అభివృద్ధి సాధ్యమని అన్నారు బుధవారం నిజామాబాద్ జిల్లా కాంగ్రెస్ పార్టీ ఆఫీసులో నిర్వహించిన ప్రెస్ మీట్ లో మాట్లాడుతూ బీజేపీపై ఘాటైన వ్యాఖ్యలు చేశారు. పదేళ్ల కాలంలో బీఆర్ఎస్ నాయకుల తప్పిదాలు ఒక్కొక్కటిగా బయట పడుతున్నాయని.. వాటిపై నోటీసులు ఇస్తే బాధ ఎందుకని అన్నారు.



నిజామాబాద్, జనవరి 21 : సింగరేణి విషయంలో పస లేని ఆరోపణలు చేస్తున్నారని.. సింగరేణి కాంట్రాక్టులు బీఆర్ఎస్ హయాంలో జరిగినవి అని అన్నారు. ఆరోపణలపై ఆధారాలు ఉంటే చర్చకు సిద్ధంగా ఉన్నామని మహేష్ కుమార్ గౌడ్ అన్నారు. బీఆర్ఎస్ హయాంలో 20 శాతం ఎక్సెస్ టెండర్లు జరిగాయని అన్నారు. కాంగ్రెస్

-మిగతా 2 లో..

### బిఆర్ఎస్ బాటలోనే

# కాంగ్రెస్ పయనం

**రాజకీయ ప్రయోగశాలగా సింగరేణి**

**అన్ని రకాలుగా సింగరేణి విధ్వంసం**

**ప్రభుత్వం కోరితే సిబిఐ విచారణకు సిద్ధం**

**కేంద్రమంత్రి కిషన్ రెడ్డి వెల్లడి**



సింగరేణిని రాజకీయ ప్రయోగశాలగా మార్చారని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ఆరోపించారు. గతంలో బీఆర్ఎస్, ఇప్పుడు కాంగ్రెస్ విధ్వంసం చేస్తున్నాయన్ని ÷ర్ అయ్యారు. నైనీ కోలి విషయంలో కేంద్రం సహకారం అందిస్తోందన్నారు. ఢిల్లీలో కిషన్ రెడ్డి మాట్లాడుతూ 'సింగరేణిని అన్ని రకాలుగా విధ్వంసం చేశారు. బీఆర్ఎస్ ఎలా పనిచేసిందో కాంగ్రెస్ అలానే పనిచేస్తుందన్నారు.

న్యూఢిల్లీ, జనవరి 21 : దేశ బొగ్గు ఉత్పత్తిలో సింగరేణి కీలకపాత్ర పోషిస్తోందని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. అయి-ంతే, తెలంగాణ వచ్చాక సింగరేణికి ఇబ్బందులు ఎదురవుతున్నాయని చెప్పారు. సింగరేణి

-మిగతా 2 లో..



**నేటి చికెన్ ధరలు**

| | |
|---|---|
| పారం ధర లైవ్ బర్డ్ | 156 (కిలో) |
| రిటైల్ లైవ్ బర్డ్ | 183 (కిలో) |
| డ్రెస్డ్ స్కిన్‌తో | 265 (కిలో) |
| స్కిన్ లెస్ | 302 (కిలో) |
| 12 గుడ్ల రిటైల్ ధర | ₹72 |

### కుక్కల గురించి కాదు..

# భర్తలను చంపుతున్న వారి సంగతేంటి

**రేణూదేశాయ్‌కు విహెచ్ చురకలు**



హైదరాబాద్, జనవరి 21 : రేణు దేశాయ్.. అమల లాంటి వాళ్ళు కుక్కలను చంపొద్దని అంటున్నారని.. మూగ జీవుల గురించి బాగానే మాట్లాడుతున్నారు.. భర్తలను చంపుతున్న భార్యల సంఖ్య పెరుగుతుందని కాంగ్రెస్ సీనియర్ నేత హనుమంతరావు అన్నారు. ఒకప్పుడు

-మిగతా 2 లో..

### ఎవరు కోరినా

# మద్దతు ఇస్తాం

**మున్సిపల్ ఎన్నికలకు జాగృతి దూరం**

**ఫోన్ ట్యాపింగ్ తుదిదశకు చేరుతుందన్న నమ్మకం లేదు**

**మీడియాతో జాగృతి అధ్యక్షురాలు కవిత**

హైదరాబాద్, జనవరి 21 : జాగృతి ఇంకా పూర్తిస్థాయి రాజకీయ పార్టీగా మారలేదని.. అందుకే ఈ ఎన్నికల్లో పోటీ చేయడం లేదని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత స్పష్టం చేశారు. త్వరలో జరగనున్న మున్సిపల్ ఎన్నికలపై కవిత కీలక వ్యాఖ్యలు

-మిగతా 2 లో..





### తెలంగాణలో

# వైద్యవిద్యకు పెద్దపీట

**అన్ని వర్గాల సంక్షేమమే మా లక్ష్యం**

**డిప్యూటి సిఎం భట్టి విక్రమార్క**

జగిత్యాల, జనవరి 21 : తెలంగాణలో విద్య, వైద్యం, అన్ని వర్గాల సంక్షేమంతోపాటు అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి

-మిగతా 2 లో..



# కాంగ్రెస్‌కు ఓటేస్తే జిల్లాలు ఎత్తేయడం ఖాయం

(మొదటిపేజీ తరువాయి)

గెలుస్తామని కేటీఆర్ ధీమా వ్యక్తం చేశారు. మున్సిపల్ ఎన్నికల తర్వాత జీహెచ్ఎంసీ ఎన్నికలు జరుగుతాయి. జిల్లా పరిషత్ ఎన్నికలు పెట్టే అలోచనలో ప్రభుత్వం లేదు. జీహెచ్ఎంసీ ఎన్నికల తర్వాత అసెంబ్లీ ఎన్నికలేనన్నారు. మున్సిపల్ ఎన్నికలకు అన్ని రకాల ఏర్పాట్లు చేసుకున్నామని.. శివరాత్రి లోపలే మున్సిపల్ ఎన్నికలు ముగిస్తారని కేటీఆర్ పేర్కొన్నారు. బస్తీబాట కార్యక్రమంతో క్షేత్రస్థాయిలో సమస్యలు తెలుసుకుంటున్నాం. పదేళ్లలో మేము చేసినవి.. కాంగ్రెస్ రెండేళ్లుగా చేయనివి గుర్తు చేస్తున్నామని కేటీఆర్ తెలిపారు. సర్వేలు, అభ్యర్థి బలాలు ఆధారంగా అభ్యర్థుల ఎంపిక ఉంటుందన్నారు. ఎన్నికల్లో జనసేన సహా ఎవరైనా పోటీ చేయొచ్చు. క్షేత్రస్థాయిలో బలముంటే తప్ప.. స్థానిక ఎన్నికల్లో గెలవటం ఈజీ కాదు. జిల్లాలను ఎత్తేసే ప్రయత్నం జరుగుతుంది. జనగాం, నారాయణ పేట, వనపర్తి, సిద్దిపేట, సిరిసిల్ల, నిర్మల్, మంచిర్యాల జిల్లాలను ఎత్తేస్తారనే ఆందోళన ఉంది .జిల్లాలు ఉండాలా.. పోవాలా..? అనేది మున్సిపల్ ఎన్నికల్లో ప్రజలే నిర్ణయిస్తారు. బొగ్గు కుంభకోణంపై సీబీఐ విచారణ కోరే దమ్ముందా..? రేవంత్ రెడ్డి చేస్తోన్న తుగ్లగ్ పనులతో జంట నగరాల అస్థిత్వం దెబ్బ తింటుంది . సినిమా టిక్కెట్లు పెంచేది లేదని యూ టర్న్ తీసుకున్నారు. మున్సిపాలిటీల వారీగా బీఆర్ఎస్ ఇంచార్జులు నియమిస్తున్నాం. మున్సిపల్ ఎన్నికల కోసం ప్రతీ ఉమ్మడి జిల్లాకు ఇంచార్జ నియమించామని.. 8 ఉమ్మడి జిల్లాల సన్నాహక సమావేశాలు పూర్తి చేశామని పేర్కొన్నారు. జిల్లాల తొలగిస్తారని ప్రచారం జరుగుతుంది. దీనితో చాలా చోట్ల ప్రజల్లో ఆందోళన ఉన్నదని కేటీఆర్ అన్నారు. కొత్త జిల్లాలు చేసిన పట్టణాల్లో జిల్లాలు ఎత్తేసారు అనే భావనలో ఉన్నారు. ప్రజలు అంతా కూడా ఆందోళనలో ఉన్నారు. జిల్లాల అంశాన్ని ప్రధాన అస్త్రంగా మున్సిపల్ ఎన్నికలలో ప్రచారం చేస్తామన్నారు. మున్సిపల్ ఎన్నికల్లో ఎన్నికల కో ఆర్డినేటర్లను పెడుతున్నాం.స్థానిక నాయకులు ఎవరికి టికెట్ ఇవ్వాలని డిసైడ్ చేస్తారు.ఎన్నికలు లేని నాయకులు, ఎమ్మెల్యేలను మున్సిపల్ ఎన్నికల దగ్గర ఇంచార్జ్ లుగా నియమిస్తాం.లోకల్ ఎన్నికలు కాబట్టి లోకల్ వాళ్లే ప్రచారం చేస్తారు.స్థానికత ఆధారంగా ప్రచారం నిర్వహించనున్నట్టు కేటీఆర్ వెల్లడించారు.స్థానిక సమస్యలను ఎజెండాగా ముందుకు తీసుకొని ముందుకు వెళ్తాం. ముఖ్యమంత్రి హార్వర్డ్ వెళ్లి మంచిగా తిరిగి వస్తారు అనుకుంటున్నా. పఠాన్ చెరువు ఎమ్మెల్యే కూడా మా బీఆర్ఎస్ పార్టీనే గెలిపించాలి అంటున్నారు. మేము కూడా అదే అంటున్నామని కేటీఆర్ స్పష్టం చేశారు.పార్టీ మారిన తర్వాత ఆయా నియోజకవర్గాలలో వారికి వ్యతిరేకంగా వీరోచితంగా పోరాటం చేస్తున్నారు.సింగరేణిపై మంత్రులు మాట్లాడడం లేదు. సింగరేణిపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలి.ఒక్క వైపు ఫార్ములా ఈ అంటాడు. అందులో ప్రూవ్ చెయ్యి.ఇక్కడ ఫార్ములా ఈపై విచారణ అంటాడు. అక్కడ దావోస్‌లో గ్రీన్ కోతో చర్చలు జరుపుతున్నారు. ఒక్క దగ్గర మంచోళ్ళు అవుతారు. మరో దగ్గర చెడ్డోళ్లు అవుతారు ఎలా..? హైద్రాబాద్ కార్పొరేషన్ ఒక్కటే ఉండే మేమేం మార్చలేదు. రేవంత్ రెడ్డి జవాబు చెప్పాలి. రేవంత్ రెడ్డి తుగ్లక్, సమాధానం చెప్పే వరకు ఆయన వెంబడి పడుతాం అన్నారు. రేవంత్‌లో రాము ఉన్నాడు.. రెమో ఉన్నాడని కేటీఆర్ అన్నారు. ఉదాహరణకు సినిమా టికెట్లు పెంచం అంటాడు , మరోవైపు సినిమా టికెట్లు పెంచుతూ జీవో ఇస్తారు. సర్వాయి పాపన్న పేరు మీద జనగామ జిల్లా చేస్తాం అన్నారు కానీ ఇప్పుడు మళ్ళీ అదే జిల్లాను తొలగిస్తాం అన్నారు. అందుకే ఆయన రాము రెమో అని అన్నానని చెప్పుకొచ్చారు కేటీఆర్.

# కుక్కల గురించి కాదు... భర్తలను చంపుతున్న వారి సంగతేంటి

(మొదటిపేజీ తరువాయి)

భర్త కోసం సతిసావిత్రి యముడితో పోరాడింది.. నేడు భర్తలను భార్య.. భార్యలను భర్తలు చంపుకునేది పెరిగిందన్నారు. ఇలా చేస్తుకుంటూపోతే పిల్లల సంగతి ఏంటి..? అని ప్రశ్నించారు. తాజాగా బుధవారం మీడియాతో మాట్లాడిన వీహెచ్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ఈ అంశాలపై విద్యావంతులు.. మేధావులు ఆలోచించాలని సూచించారు. ఈ తరహా హత్యలను ఆపేందుకు ప్రయత్నం చేయాలన్నారు. మహిళా సంఘాలు కూడా సమావేశాలు పెట్టి ఆలోచించాలని సూచించారు.ఇదిలా ఉండగా.. జంతు ప్రేమికురాలిగా, సామాజిక అంశాలపై స్పందించే వ్యక్తిగా గుర్తింపు పొందిన సినీ నటి రేణు దేశాయ్ మరోసారి వార్తల్లో నిలిచారు. ఈసారి ఆమె ఏకంగా దేశ అత్యున్నత న్యాయస్థానం తీర్పునే సవాల్ చేస్తూ, వీధి కుక్కల హత్యలపై తన ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు. కుక్కలను వ్యతిరేకిస్తూ వాటిని చంపాలని చూస్తున్న వారికి 'పిచ్చి పట్టింది' అంటూ ఆమె చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు సోషల్ మీడియాలో ప్రకంపనలు సృష్టిస్తున్నాయి. వీధి కుక్కల విషయంలో సుప్రీంకోర్టు వెలువరించిన తీర్పుపై రేణు దేశాయ్ కఠినంగా స్పందించారు. 'మొత్తం న్యాయం అనేది ఒక జోక్ అయిపోయింది. దానికి నేనే సాక్ష్యం' అంటూ ఆమె తీవ్రమైన విమర్శలు చేశారు. ఈ తీర్పు ఇచ్చిన జడ్జికి కుక్కల మీద ఏదైనా వ్యక్తిగత ద్వేషం ఉండి ఉండవచ్చని, ఇది మానవత్వంతో ఇచ్చిన తీర్పు కాదని ఆమె సంచలన ఆరోపణలు చేశారు. ఈ అంశంపై తాజాగా వీహెచ్ స్పందిస్తూ ఈ వ్యాఖ్యలు చేశారు.

# తెలంగాణలో వైద్యవిద్యకు పెద్దపీట

(మొదటిపేజీ తరువాయి)

ఉందని తెలంగాణ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తెలిపారు. జగిత్యాల జిల్లా ధర్మపురిలో బుధవారం రూ.200 కోట్లతో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ పాఠశాల భవనం, రూ.10 కోట్లతో ప్రభుత్వ డిగ్రీ కళాశాల భవనం, రూ.17 కోట్లతో వాటర్ ప్లాంటు నిర్మాణం, రూ.2 కోట్ల అంచనా వ్యయంతో ఎస్సీ బాలుర వసతిగృహ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం స్థానికంగా ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ఆయన ప్రసంగించారు. 'జిల్లాలో ఇంటిగ్రేటెడ్ మోడల్ పాఠశాల నిర్మాణానికి రూ.200 కోట్లు కేటాయించాం. ఒకే ప్రాంగణంలో విద్య, ఆటలు, హాస్టల్, ల్యాబ్స్, డైనింగ్, క్రీడలు అన్నీ ఉండేలా ప్రణాళిక రూపొందించాం. పేద కుటుంబాల పిల్లలకు మంచి అవకాశాలు ఇస్తే వారు సమాజంలో ఉన్నత స్థాయికి ఎదుగుతారని మేం నమ్ముతున్నాం. వెనుకబడిన వర్గాలు చదువులు, ఉద్యోగాల్లో, సమాజ నిర్మాణంలో ముందుకు రావాలంటే ప్రభుత్వం తరఫున చేయాల్సిన కృషి చేస్తున్నాం. అభివృద్ధి అంటే కేవలం భవనాల నిర్మాణం కాదు, ప్రజల జీవితాల్లో మార్పు రావడం. ఎన్నికల సమయంలో చేసిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తున్నాం. పారదర్శకత, నిబద్ధత, సంకల్పంతో ముందుకు సాగుతున్నాం' అని భట్టి అన్నారు. ఈ కార్యక్రమంలో మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, అడ్లూరి లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

# దావోస్ సదస్సుకు ఫాలో అప్ హైదరాబాద్ సదస్సు

ఉంది. అలాగే.. కాలిఫోర్నియా కేంద్రంగా ఉన్న బ్లైజ్ కంపెనీతో మరో ఎంవోయూ కుదిరింది. వరల్డ్ ఎకనమిక్ ఫోరమ్ వేదికపై సీఎం రేవంత్ రెడ్డితో సీఈఓ దినాకర్ మునగాలా సమావేశమయ్యారు. హెల్త్‌కేర్, మాన్యుఫ్యాక్చరింగ్, ఎఐ ఎనర్జీ రంగాల్లో పైలట్ ప్రాజెక్టులపై చర్చలు జరిగాయి. తక్కువ విద్యుత్ వినియోగంతో ఎఐహార్డ్‌వేర్, ఫుల్-స్టాక్ సాఫ్ట్‌వేర్ అభివృద్ధిలో బ్లైజ్ సంస్థ అగ్రగామి. ఈ ఒప్పందం ద్వారా హైదరాబాద్‌లో రీసెర్చ్ అండ్ డెవెలప్మెంట్ సెంటర్ విస్తరణకు బ్లైజ్ నిర్ణయం తీసుకుంది. ఈ ఒప్పందంతో తెలంగాణలో ఎలక్ట్రానిక్స్, సెమీ కండక్టర్, ఎఐ రంగాలకు ఊపిరి లభించనుంది. తెలంగాణను ఎఐ డేటా సెంటర్ హబ్‌గా మార్చడమే లక్ష్యమని రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. తెలంగాణ ఎఐ ఇన్నోవేషన్ హబ్ ప్రారంభంకానుందని మంత్రి శ్రీధర్ బాబు ప్రకటించారు. అంతేకాకుండా.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని 'తెలంగాణ రైజింగ్' బృందం రష్మి గ్రూప్‌తో స్టీల్ ప్లాంట్ ఏర్పాటుకు సంబంధించిన భారీ ఎంవోయూ కుదుర్చుకుంది. తెలంగాణలో రష్మి గ్రూప్ ఆధునిక స్టీల్ ప్లాంట్‌ను ఏర్పాటు చేసేందుకు ముందుకు వచ్చింది. దీనికి సుమారు 12,500 కోట్ల రూపాయల పెట్టుబడి పెట్టనుంది. ఈ ప్రాజెక్ట్ ద్వారా రాష్ట్రంలో 12 వేల మందికి ప్రత్యక్షంగా, పరోక్ష ఉద్యోగాలు కల్పించే అవకాశం ఉంది. డ్టకైల్ ఐరన్ పైపుల తయారీలో అంతర్జాతీయంగా గుర్తింపు పొందిన రష్మి గ్రూప్... ఆసియా, యూరప్, ఆఫ్రికా, అమెరికా దేశాల్లో విస్తృత కార్యకలాపాలు నిర్వహిస్తోంది. తెలంగాణ ప్రభుత్వం ఈ ప్రాజెక్టుకు అవసరమైన అన్ని అనుమతులు, బొగ్గు లింకేజీలు అందిస్తామని హామీ ఇచ్చింది. గ్రీన్ మాన్యుఫ్యాక్చరింగ్, సర్క్యులర్ ఎకానమీ విధానాలపై కూడా భాగస్వామ్య చర్చలు జరిగాయి. కాగా.. సీఎం రేవంత్.. జనవరి 20 నుంచి 23 వరకు దావోస్‌లోని డబ్ల్యూఈఎఫ్ 2026 సదస్సులో పాల్గొననున్నారు. పర్యటనలో సీఎంతో పాటు ఐటీ, పరిశ్రమల మంత్రులు డి.శ్రీధర్ బాబు, పొంగులేటి శ్రీనివాస రెడ్డి, స్పెషల్ చీఫ్ సెక్రెటరీలు జయేశ్ రంజన్, సంజయ్ కుమార్, సీఎం స్పెషల్ సెక్రెటరీ అజిత్ రెడ్డి తదితరులు ఉన్నారు. 'తెలంగాణ రైజింగ్ 2047' విజన్‌ను ప్రపంచ నాయకులు, సీఈఓల ముందు ప్రదర్శించడమే ప్రధాన లక్ష్యంగా రేవంత్ దావోస్ పర్యటన కొనసాగుతోంది.



## దావోస్ వేదికపై చిరు ప్రత్యక్షం

### సిఎం రేవంత్‌తో కలసి సదస్సుకు హాజరు

**హైదరాబాద్, జనవరి 21 :** స్విట్జర్లాండ్‌లోని దావోస్‌లో జరుగుతున్న ప్రపంచ ఆర్థిక సదస్సులో మెగాస్టార్ చిరంజీవి తళుక్కుమన్నారు. తెలంగాణ సిఎం రేవంత్ రెడ్డితో కలిసి ప్రముఖ సినీనటుడు చిరంజీవి పాల్గొన్నారు. చిరంజీవి తన కుటుంబంతో కలిసి విహారయాత్ర కోసం స్విట్జర్లాండ్‌కు వెళ్లారు. ఈ సమయంలోనే దావోస్ లో ప్రపంచ ఆర్థిక సదస్సు జరుగుతుండటంతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి.. చిరంజీవిని అక్కడికి ఆహ్వానించారు. చిరంజీవి ఆ దేశంలోని జ్యూరిక్‌లో ఉన్నారని తెలుసుకున్న ముఖ్యమంత్రి.. సదస్సుకు రావాలని ఆహ్వానించడంతో ఆయన కూడా హాజరయ్యారు. సదస్సు వేదికపై ఆవిష్కరించిన తెలంగాణ రైజింగ్-2047 విజన్ డాక్యుమెంట్ ను చిరంజీవి చూశారు. అంతర్జాతీయ వేదికపై తెలంగాణ అభివృద్ధి దృక్పథాన్ని ఈ డాక్యుమెంట్ ప్రతిబింబించింది.

అనంతరం చిరంజీవితో రేవంత్ మాట్లాడుతూ ..కుటుంబసభ్యులతో కలిసి 'మన శంకరవరప్రసాద్ గారు' సినిమా చూశానని.. ఎంతో ఆస్వాదించానని తెలిపారు. ఈ సందర్భంగా చిరంజీవికి సిఎం అభినందనలు తెలిపారు.

# రాజకీయ ప్రయోగశాలగా సింగరేణి

(మొదటిపేజీ తరువాయి)

విషయంలో వివాదం నెలకొన్న నేపథ్యంలో ఆయన మీడియాతో మాట్లాడారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలు సింగరేణిని అన్ని రకాలుగా విధ్వంసం చేశాయని ఆరోపించారు. నైనీ కోల్ బ్లాక్ విషయంలో బీఆర్ఎస్ బాటలోనే కాంగ్రెస్ వెళ్తోందని విమర్శించారు. సింగరేణి రాజకీయ ప్రయోగశాలగా మారిందన్నారు. బీఆర్ఎస్ హయాంలో అనేక రకాల అక్రమాలు జరిగాయి. రాష్ట్ర విద్యుత్ సంస్థలకు విద్యుత్ కోసం తెలంగాణకు నైనీ కోల్ బ్లాక్ కేటాయించారు. దానికి కేంద్రం నుంచి అన్ని రకాల సహాయ సహకారాలున్నాయి. గతంలో నైనీ కోల్ బ్లాక్ టెండర్ల ప్రక్రియలో సీఎం జోక్యం చేసుకొని రద్దు చేశారు. సింగరేణి మైనింగ్‌కు ముందుకొస్తే బీఆర్ఎస్ ప్రైవేటు సంస్థకు కట్టబెట్టిందన్నారు. బొగ్గు గనుల కొరత ఉందని తెలిసి ప్రైవేటు వ్యక్తులకు ఎలా ఇస్తారని కిషన్ రెడ్డి ప్రశ్నించారు. సింగరేణి, నైనీ కోల్ బ్లాక్ అక్రమాలపై చర్చ జరగాలని, సీబీఐ దర్యాప్తునకు రాష్ట్రం ముందుకొస్తే కేంద్రం పరిశీలిస్తుందని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి తెలిపారు. ఒడిశాలో బీజేపీ వచ్చాక అక్కడి ప్రభుత్వంతో అనుమతులపై చర్చించాను. నైనీ బొగ్గు గనులకు చివరి పర్మిషన్ వచ్చాక పనులు ఎందుకు ఆలస్యం చేశారు? బీఆర్ఎస్ హయాంలోనూ అనేక అక్రమాలు జరిగాయి. ఆరోజు కొందరు వ్యక్తులకు లాభంగా చేకూరేలా వ్యవహరించారు. సింగరేణి అక్రమాలపై సీబీఐదర్యాప్తు జరగాలి. రాష్ట్రం ముందుకొస్తే కేంద్రం పరిశీలిస్తుంది. సింగరేణి మైనింగ్కు ముందుకు వస్తే, చెయ్యలేమని ప్రైవేట్ కు కట్టబెట్టారు. సంస్థని బెదిరించి లేఖ రాయించారు. ఈ వివాదంలోకి నన్ను కూడా లాగుతున్నారు. బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు ఏం చేసింది.. సింగరేణి భవిష్యత్తు ప్రమాదకరంగా మార్చారు. సంస్థను పూర్తిగా ప్రక్షాళన చేయాలని అన్నారు. కలో ఇండియాలో విలీనంపై మాట్లాడుతూ పరిశీలిస్తున్నామని అన్నారు. మెట్రో రెండో దశ తదితర అంశాలపైనా ఆయన తన అభిప్రాయాలు వెల్లడించారు. అందుకే సిఎంకు లేఖరాశానని అన్నారు.

# మున్సిపల్ ఎన్నికలకు జాగృతి దూరం

(మొదటిపేజీ తరువాయి)

చేశారు. తెలంగాణ ఉద్యమకారుడు ముచ్చర్ల సత్యనారాయణ జయంతి సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో కవిత మాట్లాడారు. మున్సిపల్ ఎన్నికల్లో ఎవరు మద్దతు కోరినా ఇస్తామని కవిత తెలిపారు. అవసరమైన చోట తనతో పాటు జాగృతి నేతలు ప్రచారం చేస్తారని చెప్పారు. ఫోన్ ట్యాపింగ్ కేసు తుదిదశకు చేరుతుందనే నమ్మకం తనకు లేదన్నారు. తనలాంటి బాధితులకు న్యాయం జరిగే అవకాశం లేదని చెప్పారు. కావాలనే హరీశ్‌రావుకు సిట్ నోటీసులు ఇచ్చి డైవర్షన్ చేస్తున్నారన్నారు. ఫోన్ ట్యాపింగ్ కేసుకు సంబంధించి కీలక వ్యాఖ్యలు చేశారు. గుంపు మేస్త్రీ, గుంట నక్క కలిసే ఉన్నారంటూ విమర్శించారు. ఫోన్ ట్యాపింగ్ పేరుతో డ్రామా మొదలుపెట్టారని ఆరోపించారు. మున్సిపల్ ఎన్నికల సమయంలోనే ఎందుకు విచారణ చేపట్టారని ఆమె ప్రశ్నించారు. ఫోన్ ట్యాపింగ్ ఇప్పట్లో తుది దశకు చేరుతుందని తాను అనుకోవడంలేదని ఆమె చెప్పారు. విచారణ వల్ల తనలాంటి బాధితులకు న్యాయం జరుగుతుందని భావించటంలేదని కవిత అన్నారు. పొలిటికల్ పవర్ బలహీన వర్గాలకు వచ్చినప్పుడే ఆ సమాజం బాగుపడుతుందన్నారు. చాలామంది ఎన్నికల్లో పోటీచేస్తామని అడుగుతున్నారని.. కానీ జాగృతి పూర్తిస్థాయి రాజకీయ పార్టీ కాలేదని వెల్లడించారు. యువత, మహిళలు ఎక్కడ పోటీచేసినా జాగృతి మద్దతిస్తుందని ఆమె స్పష్టం చేశారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ నేతలు బీసీలను మభ్యపెడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మున్సిపల్ ఎన్నికల్లో బీసీలకు 42 శాతం వాటా ఇవ్వకుండానే ప్రభుత్వం ఎన్నికలకు వెళుతోందని విమర్శించారు. జిల్లాల పునర్విభజన ఎప్పుడు జరిగినా సికింద్రాబాద్‌ను జిల్లా చేయాల్సిందేనని కవిత డిమాండ్ చేశారు. పీవీ.నరసింహారావు పేరు ఏదో ఒక జిల్లాకు పెట్టాలని కూడా కవిత కోరారు.కొత్త జిల్లాల ఏర్పాటుతో ఉద్యోగులు, యువతకు నష్టం జరిగిందని కవిత విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక ఐదు శాతం ఓపెన్ కోటాను నాన్ లోకల్‌గా మార్చడంతో రాష్ట్ర యువతకు నష్టం జరుగుతోందని తెలిపారు. జాగృతి తరఫున అధ్యయనం చేస్తున్నామని.. జిల్లాల పునర్విభజన కమిషన్ ఏర్పాటు చేస్తే నివేదిక ఇస్తామని తెలిపారు. కొత్త పార్టీ ఏర్పాటు కసరత్తు వేగంగా జరుగుతోందని.. జీహెచ్ఎంసీ ఎన్నికల నాటికి పక్రియ పూర్తవుతుందో లేదో చూడాలని కవిత అన్నారు. ఎన్నికల కమిషన్ వద్ద కూడా అడ్డంకులు సృష్టించే అవకాశం లేకపోలేదని తెలిపారు. పార్టీకి ఇంకా ఏ పేరు అనుకోలేదని.. తెలంగాణ రాష్ట్ర జాగృతి సమితి అని కొందరు సూచించారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో ఏ అంశానికి కూడా న్యాయం చేస్తారన్న నమ్మకం తనకు లేదని అన్నారు. నైని బొగ్గు గని అంశం కంటే సింగరేణికి కొత్త బొగ్గు గనులు వచ్చేలా చూడాలని డిమాండ్ చేశారు. సింగరేణిలో సైట్ విజిటింగ్ సర్టిఫికెట్ విధానం ఎప్పటి నుంచో ఉందని.. కాంగ్రెస్ వచ్చిన తర్వాత దాన్ని ప్రధాన నిబంధనగా పెట్టారని.. కొంత మందికి మాత్రమే సెలెక్టివ్‌గా ఇస్తున్నారని తెలిపారు. విచారణ చేయించాల్సిన కాంగ్రెస్ నేతలు లేఖ రాయాలని కోరడం విడ్డూరంగా ఉందని అన్నారు. జాగృతి అధికారంలోకి వచ్చిన తర్వాత.. 2014 నుంచి సమగ్ర విచారణ చేస్తామని తెలిపారు.గతంలో సర్పంచ్‌లను కలవని వారు ఇప్పుడు వారితో కలిసి ఫోటోలు దిగుతున్నారని.. ఇది సంతోషించదగ్గ విషయమన్నారు . దాంతో సామాజిక తెలంగాణ వైపు కొంత మేర అడుగులు పడుతున్నాయని చెప్పుకొచ్చారు. కేసీఆర్‌కు నోటీసులు ఇస్తారన్న అంశం గురించి తనకు తెలీదని, తాను ఇప్పుడు బీఆర్ఎస్‌లో లేనని స్పష్టం చేశారు. జీహెచ్ఎంసీ 300 డివిజన్ల ప్రతిపాదన బీఆర్ఎస్ హయాంలోనిదే అని, కాంగ్రెస్ ప్రభుత్వం ఆ ప్రతిపాదనను కొనసాగిస్తోందన్నారు. జాగృతి జనంబాట ముగింపు మార్చి పదో తేదీన అనుకుంటున్నామని.. ఆ తర్వాత బీఆర్ఎస్, కాంగ్రెస్ మంత్రుల అవినీతిపై ర్యాంకులు ప్రకటిస్తామని కవిత పేర్కొన్నారు.'నా టా÷-గ్గ÷ట్ హరీశ్ రావు, ఇంకా పెద్ద టా÷-గ్గ÷ట్ కూడా ఉంది. కేటీఆర్‌ను కూడా విమర్శించాను. బలమైన రాజకీయ భవిష్యత్ కోసం పటిష్ట ఎజెండా సిద్ధం చేసుకుంటున్నాను, ఈ దశలో నాకు నేనుగా ఎవరితోనూ మాట్లాడను. రాజకీయ కన్సల్టెన్సీలు ఎవరినీ నేను సంప్రదించలేదు, నన్ను సంప్రదించిన కొంత మందితో మాట్లాడాను' అని కల్వకుంట్ల కవిత వెల్లడించారు. తెలంగాణ ఉద్యమకారులు ముచ్చర్ల సత్యనారాయణ జయంతి సందర్భంగా తెలంగాణ జాగృతి కార్యాలయంలో బుధవారం ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత.. ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కవిత మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత కూడా ఉద్యమకారులను పట్టించుకోలేదని విమర్శించారు. ట్యాంక్‌బండ్ మీద ఆంధ్రావారి విగ్రహాలు తప్ప తెలంగాణ మహనీయులవి లేవని.. వాళ్ల విగ్రహాలు తొలగించాలని తాము అనటం లేదని.. అవసరం వస్తే తప్పుదంటూ వ్యాఖ్యానించారామె. అమరజ్యోతిపై అవినీతి మరకలు పడ్డాయని, అందుకే దాన్ని ఓపెన్ చేయడంలేదని కవిత అన్నారు.ట్యాంక్‌బండ్‌పై తెలంగాణ ఉద్యమకారుల విగ్రహాలు ఉండాలన్నారు. ముచ్చర్ల సత్యనారాయణ విగ్రహం అక్కడ పెట్టాలని కవిత డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక ఐదు శాతం ఓపెన్ కోటాను నాన్ లోకల్ గా మార్చడంతో రాష్ట్ర యువతకు నష్టం జరుగుతోందన్నారు. జాగృతి తరఫున అధ్యయనం చేస్తున్నాం, జిల్లాల పునర్విభజన కమిషన్ ఏర్పాటు చేస్తే నివేదిక ఇస్తామన్నారు.

# 47 మంది కమిషనర్ల బదిలీ

(మొదటిపేజీ తరువాయి)

చర్యలు తప్పవని కూడా హెచ్చరించింది. ఎలక్షన్ కమిషన్ నిబంధనల మేరకు సొంత జిల్లాల్లో ఉన్నవారిని, అలాగే ఒకే చోట మూడేళ్లు దాటిన వారిని మార్చేసినట్లు ప్రభుత్వ వర్గాలు చెబుతున్నాయి. బదిలీ అయిన వివరాలు ఇలా ఉన్నాయి. సి.వి.ఎన్. రాజు, మున్సిపల్ కమిషనర్ (గ్రేడ్-ఎఎఎ), ఆదిలాబాద్ మున్సిపాలిటీ, ఉమా మహేశ్వర్ రావు, మున్సిపల్ కమిషనర్ (గ్రేడ్-ఎఎ), ప్రస్తుతం రామగుండం మున్సిపల్ కార్పొరేషన్‌లో సెక్రటరీగా పని చేస్తున్నారు., కె. సమ్మయ్య, సెక్షన్ ఆఫీసర్, సచివాలయం హుజురాబాద్ మున్సిపల్ కమిషనర్‌గా బదిలీ అయ్యారు. కీర్తి నాగరాజు, మున్సిపల్ కమిషనర్ (గ్రేడ్-ఎఎఎ), చొప్పదండి మున్సిపాలిటీకి, టి. మనోహర్, మేనేజర్, రాయికల్ మున్సిపాలిటీలో మున్సిపల్ కమిషనర్‌గా విధులు. ఎ. శ్రీనివాసరావు, ఎంపీడీఓ, ఎదులా పురం మున్సిపాలిటీలో మున్సిపల్ కమిషనర్‌గా విధులు. ఎం. రామదుర్గ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ (గ్రేడ్-ఎఎ), హాలియా మున్సిపాలిటీ. నజీబ్, మేనేజర్, భూత్పూర్ మున్సిపాలిటీలో మున్సిపల్ కమిషనర్‌గా (ఓడీ ప్రాతిపదికన). నాగరాజు, మున్సిపల్ కమిషనర్ (గ్రేడ్-ఎఎఎ), అమర్చింత మున్సిపాలిటీ. కె. సంపత్ కుమార్, మున్సిపల్ కమిషనర్ (గ్రేడ్-ఎఎఎ), మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్. టి. రమేష్, మేనేజర్, బెల్లంపల్లి మున్సిపాలిటీలో మున్సిపల్ కమిషనర్ జె. సంపత్, మున్సిపల్ కమిషనర్ (గ్రేడ్-ఎఎఎ), ములుగు మున్సిపాలిటీ. ఎం. రామచంద్రరావు, ఎంపీఓ, కల్లూరు మున్సిపాలిటీ మున్సిపల్ కమిషనర్‌గా (ఓడీ ప్రాతిపదికన). ఎం. మునావర్ అలీ, మున్సిపల్ కమిషనర్ (గ్రేడ్-ఎఎఎ), తిరుమలగిరి మున్సిపాలిటీ. జి. రాజు, మున్సిపల్ కమిషనర్ (గ్రేడ్-ఎఎ), క్యాతనపల్లి మున్సిపాలిటీ. పి. చంద్రశేఖర్ రావు, మున్సిపల్ కమిషనర్ (గ్రేడ్-ఎఎ), కొల్లాపూర్ మున్సిపాలిటీకి బదిలీ అయ్యారు. ఈ ఉత్తర్వులు తక్షనమే అమల్లోకి వచ్చాయి.

# రాముడి పేరు చెప్పకుండా ఎన్నికల్లో నిలబడగలరా



అధికారంలోకి వచ్చినాక అన్ని శాఖలను ప్రక్షాళన చేశామని.. పదేళ్ల బీఆర్ఎస్ హయాంలో జరిగిన లోపాలను సరిదిద్దుతున్నామని అన్నారు. కేటిఆర్, హరీష్ రావులు బట్ట గాల్చి మీద వేసే ప్రయత్నం చేస్తున్నారని.. ఎన్నికల లబ్దికోసం నోటీసులు ఇస్తున్నారనేది సమంజసం కాదని అన్నారు.ఫోన్ ట్యాపింగ్ అనేది అత్యంత నేరం..అలాంటి నేరం బీఆర్ఎస్ నాయకులు చేసారని.. సినీ నిర్మాత తారలు,స్వంత పార్టీ ఎమ్మెలేల ఫోన్ లు కూడా ట్యాప్ చేసారని అన్నారు మహేష్ కుమార్ గౌడ్. సిట్ విచారణలో రాజకీయ కక్ష కోణం ఎక్కడా లేదని.. నిజంగా తప్పు చేయకుంటే వివరణ ఇచ్చే ప్రయత్నం చేయాలని అన్నారు. రెండేళ్ల కాంగ్రెస్ పాలనలో కాంగ్రెస్ ఇచ్చిన సింగరేణి కాంట్రాక్టులు, పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో జరిగిన టెండర్లపై చర్చకు రావాలని అన్నారు మహేష్ కుమార్ గౌడ్. సిఎం బంధువు సృజన్ రెడ్డిపై ఆరోపణలు చేసి దెబ్బ తీయాలనే ప్రయత్నం చేస్తున్నారని అన్నారు.

# టాటా చైర్మన్‌తో సీఎం రేవంత్ భేటీ

- స్టేడియాల అభివృద్ధికి సహకరించాలని వినతి
- తెలంగాణలో ఏబీ ఇన్‌బెవ్ యూనిట్ విస్తరణకు సిద్ధం



**దావోస్, జనవరి 21 :** తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి దావోస్ పర్యటన కొనసాగుతోంది. బుధవారం ఆయన టాటా గ్రూప్ ఛైర్మన్ నటరాజన్ చంద్రశేఖరన్‌తో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో స్టేడియాల అభివృద్ధికి సహకరించాలని ఆయన్ను సీఎం కోరారు. విజన్–2047 లక్ష్యాలు, పెట్టుబడులకు ఉన్న అనుకూల విధానాలను వివరించారు. హైదరాబాద్‌లో స్టేడియాల అభివృద్ధికి టాటా గ్రూప్ సంసిద్ధత వ్యక్తం చేసింది. మూసీ నది పునరుజ్జీవంలో భాగస్వామ్యానికి, రాష్ట్రంలో హోటళ్లు, రిసార్ట్స్ ఏర్పాటుపై చంద్రశేఖ–రన్ ఆసక్తి చూపారు. రాష్ట్రంలో కొత్త మ్యానుఫాక్చరింగ్ యూనిట్ల ఏర్పాటుపై కూడా ఇరువురి మధ్య చర్చ జరిగింది. ఇదిలావుంటే ప్రపంచంలో అతిపెద్ద బీరు తయారీ సంస్థగా పేరుగాంచిన ఏబీ ఇన్‌బెవ్ , తెలంగాణలో ఇప్పటికే ఉన్న తన తయారీ యూనిట్‌ను విస్తరించేందుకు భారీగా పెట్టుబడి పెట్టనున్నట్లు వెల్లడించింది. ఈ కంపెనీ ప్రపంచవ్యాప్తంగా 50కుపైగా దేశాల్లో సంస్థ కార్యకలాపాలు నిర్వహిస్తోంది. ప్రపంచ ఆర్థిక వేదికసదస్సులో భాగంగా దావోస్‌లో.. ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి నేతృత్వంలోని 'తెలంగాణ రైజింగ్' ప్రతినిధి బృందం ఏబీ ఇన్‌బెవ్ చీఫ్ లీగల్ అండ్ కార్పొరేట్ అఫ్ర్స్ ఆఫీసర్ జాన్ బ్లడ్తో సమావేశమయ్యారు. తెలంగాణలో ప్రస్తుతం రెండు తయారీ యూనిట్లు నిర్వహిస్తున్న ఏబీ ఇన్‌బెవ్, సుమారు 600 మందికి ఉపాధి కల్పిస్తోంది. రాష్ట్రానికి కొత్త పెట్టుబడి లభించినందుకు ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి సంతోషం వ్యక్తం చేశారు. 'తెలంగాణ రైజింగ్ 2047' విజన్‌లో భాగంగా 2047 నాటికి రాష్ట్రాన్ని 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దే దిశగా ఆదాయ వృద్ధి, సామర్థ్య నిర్మాణమే కీలకమని ముఖ్యమంత్రి వ్యాఖ్యానించారు. ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు మాట్లాడుతూ.. విధాన స్థిరత్వం, ప్రపంచ స్థాయి మౌలిక వసతులు, వ్యాపార సౌలభ్యంతో తెలంగాణలో పెట్టుబడిదారుల్లో దీర్ఘకాలికంగా విశ్వాసం పెరుగుతోందని తెలిపారు. సమావేశంలో సర్క్యులర్ వాటర్ వినియోగం, మహిళా సాధికారత, విద్య, నైపుణ్యాభివృద్ధిపై దృష్టి సారించిన సీఎస్ఆర్ వ్యయాలు వంటి అంశాల్లో తెలంగాణతో కలిసి పనిచేసే అవకాశాలపై కూడా చర్చించారు.



## హైదరాబాద్‌లో తొలి స్విస్ మాల్

### దావోస్ వేదికగా సిఎం రేవంత్ రెడ్డితో అవగాహన

**దావోస్, జనవరి 21 :** ప్రపంచ ఆర్థిక వేదిక దావోస్‌లో తెలంగాణ ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి, స్విట్జర్లాండ్‌లోని వాడ్ రాష్ట్ర ముఖ్యమంత్రి క్రిస్టెల్ లూసియర్ బ్రోడార్‌తో కీలక సమావేశం నిర్వహించారు. ఈ భేటీలో భారత్–స్విట్జర్లాండ్ స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం నేపథ్యంలో రెండు రాష్ట్రాల మధ్య సహకార పెంపుపై చర్చించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలంగాణ రైజింగ్–2047 విజన్‌ను స్విస్ ప్రతినిధులకు వివరించారు. హైదరాబాద్‌లో ప్రపంచంలోనే తొలిసారి 'స్విస్ మాల్' ఏర్పాటు చేయాలనే ఆలోచనను ముఖ్యమంత్రి ప్రతిపాదించగా, స్విస్ బృందం వెంటనే సానుకూలంగా స్పందించింది. ఇద్దరు ముఖ్యమంత్రులు ఫుట్‌బాల్ ఆటగాళ్లే కావడంతో, క్రీడల రంగంలో భాగస్వామ్యంపై కూడా విస్తృతంగా చర్చించారు. క్రీడా శిక్షణ, మౌలిక వసతుల అభివృద్ధిలో కలిసి పనిచేయవచ్చని అభిప్రాయపడ్డారు. సంస్కృతి, విద్య, నైపుణ్యాభివృద్ధి, శిక్షణ రంగాల్లో.. ముఖ్యంగా హాస్పిటాలిటీ మేనేజ్‌మెంట్, క్రీడల విభాగాల్లో.. పరస్పర సహకారానికి అవకాశాలపై లీడర్లు అభిప్రాయాలు పంచుకున్నారు. రిటైల్ , లైఫ్ సైన్సెస్‌లో రంగాల్లో అవకాశాలపై చర్చించారు. మహిళా సాధికారతకు సంబంధించి స్వయం సహాయక సంఘాల కార్యక్రమాలపై స్విస్ బృందం ఆసక్తి కనబరిచింది. సహకార అంశాలు పరిశీలించేందుకు త్వరలోనే స్విట్జర్లాండ్ బృందం హైదరాబాద్‌కు వస్తుందని వాడ్ రాష్ట్ర పరిశ్రమలు, ఆర్థిక శాఖ మంత్రి ఇసబెల్ మోరెట్ తెలిపారు.



## సింగరేణిపై బిఆర్ఎస్ దుష్ప్రచారం

### కవిత ప్రశ్నలకు సమాధానం చెప్పండి : పొన్నం

**హైదరాబాద్, జనవరి 21 :** సింగరేణిపై బీఆర్ఎస్ నేతలు దుష్ప్రచారం చేస్తున్నారని మంత్రి పొన్నం ప్రభాకర్ మండిపడ్డారు. గత ప్రభుత్వం 30 శాతం అధిక కేటాయింపులతో టెండర్లు అప్పగించిందని ఆరోపించారు. బీఆర్ఎస్ హయాంలో కాంట్రాక్టులు పొందిన వాళ్లు.. ఇప్పుడు చెడ్డవాళ్లయ్యారా అని మంత్రి ప్రశ్నించారు. హైదరాబాద్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో పొన్నం మాట్లాడారు. బీఆర్ఎస్ అధికారంలో ఉండగా ఎంతో అవినీతి జరిగినట్లు కవిత చెప్పారని.. ఆమె ప్రశ్నలకు ఆ పార్టీ నేతలు సమాధానం ఇవ్వలేదన్నారు. హిల్ట్ పాలసీలపైనా ఇలాగే ఆరోపణలు చేశారని.. అసెంబ్లీలో చర్చ పెడితే బహిష్కరించి పారిపోయారని చెప్పారు.

## ఢిల్లీలో మరోమారు క్షీణించిన గాలి నాణ్యత

**న్యూఢిల్లీ, జనవరి 21 :** ఢిల్లీలో గాలి నాణ్యత మరింతగా క్షీణించాయి. గతంకంటే గాలి నాణ్యతలు కొంత మె–రుగుపడినప్పటికీ.. ఎక్యూఐ స్థాయిలు వెరీపూర్ కేటగిరీలోనే కొనసాగతున్నాయి. బుధవారం ఉదయం 9 గంటలకు ఎక్యూఐ 339గా వద్ద నమోదైంది. దీంతో కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి (సిపిసిబి) వీటి స్థాయిల్ని వెరీపూర్ కేటగిరీలో వర్గీకరించింది. మంగళవారం ఎక్యూఐ 395 స్థాయిల వద్ద నమోదైంది. నిన్నటికంటే ఈరోజుకి గాలి నాణ్యతలు మెరుగుపడ్డాయని సిపిసిబి వెల్లడించింది. ఢిల్లీలో 30 వాతావరణ పర్యవేక్షణా కేంద్రాల్లో గాలి నాణ్యతలు 'వెరీ పూర్' కేటగిరీలోనే నమోదయ్యాయి. ఎనిమిది కేంద్రాల్లో పూర్ కేటగిరీలో ఎక్యూఐ స్థాయిలు నమోదైనట్లు సమీర్ యాప్ సమాచారం తెలిపినట్లు సిపిసిబి పేర్కొంది. ఇక ఢిల్లీలో జహంగిర్‌పూర్‌లో గాలి నాణ్యతలు పేలవంగా నమోదయ్యాయి. అక్కడ ఎక్యూఐ స్థాయిలు 390గా నమోదైనట్లు సిపిసిబి పేర్కొంది.

## ఏసీబీకి చిక్కిన హన్మకొండ అడిషనల్ కలెక్టర్ వెంకట్ రెడ్డి

### వందకోట్ల ఆస్తులు గుర్తింపు

**హన్మకొండ, జనవరి 21 :** తెలంగాణలో అవినీతి అధికారుల భరతం పడుతున్న ఏసీబీ, తాజాగా హన్మకొండ అడిషనల్ కలెక్టర్ వెంకట్ రెడ్డి నివాసంలో సోదాలు నిర్వహించి మరో భారీ కుంభకోణాన్ని వెలుగులోకి తెచ్చింది. ఒక ఫైల్ ప్రాసెసింగ్ కోసం లంచం డిమాండ్ చేస్తూ ఏసీబీ అధికారులకు చిక్కిన వెంకట్ రెడ్డి అక్రమ సామ్రాజ్యం వందల కోట్లలో ఉన్నట్లు ప్రాథమిక విచారణలో తేలింది. హైదరాబాద్, నల్గొండ, మిర్యాలగూడ , హన్మకొండలోని ఆయనకు సంబంధించిన నివాసాల్లో ఏకకాలంలో నిర్వహించిన ఈ సోదాల్లో సుమారు 100 కోట్ల విలువైన అక్రమాస్తులను అధికారులు గుర్తించారు. ఈ సోదాల్లో అధికారులు విస్తుపోయే రీతిలో ఆస్తులను కనుగొన్నారు. ఎల్‌బీ నగర్ వంటి ఖరీదైన ప్రాంతాల్లో రెండు విలాసవంతమైన విల్లాలు, వివిధ ప్రాంతాల్లో 10 ప్లాట్లు , 14 ఎకరాల వ్యవసాయ భూమికి సంబంధించిన పత్రాలను స్వాధీనం చేసుకున్నారు. వీటితో పాటు వెంకట్ రెడ్డి నివాసం , బ్యాంక్ లాకర్ల నుండి సుమారు 2 కిలోల బంగారం, 0 లక్షల బ్యాంక్ బ్యాలెన్స్‌ను అధికారులు గుర్తించారు. తన అధికారిక పదవిని అడ్డం పెట్టుకుని బినామీల పేరుతో భారీగా ఆస్తులు కూడబెట్టిన ఈ అధికారి వ్యవహారం ఇప్పుడు రాష్ట్రవ్యాప్తంగా సంచలనం రేపుతోంది.

# మేడారంలో జాతర సందడి

- భారీగా తరలి వస్తున్న భక్త జనం
- ఘనంగా మండమెలిగె పండగ నిర్వహణ
- గద్దెల వద్ద పూజులరు ప్రత్యేక పూజలు



**ములుగు, జనవరి 21 :** మేడారం సమ్మక్క సారలమ్మ దేవతల మండ మెలిగే పండుగను పూజారులు – అంగరంగ వైభవంగా నిర్వహించారు. బుధవారం ఉదయాన్నే మేడారం సమ్మక్క దేవత పూజరులు సిద్దబోయిన, కొక్కెర, మ్లలెల, వంశీయులు, నె రాలమ్మ పూజారులు కాక వంశీయులు వారి వారి ఇళ్లను శుభ్రం చేసుకున్నారు. అనంతరం పిల్లాపాపలతో సహా పవిత్ర స్నానాలు చేశారు. సమ్మక్క పూజారులు మేడారం గుడికి సారలమ్మపూజారులు కన్నెపెల్లి గుడికి వెళ్లి గుడులను పవిత్ర గోదావరి జలంతో శుద్ధి చేశారు. అనంతరం సమ్మక్క పూజారి ఆయన సిద్దబో యిన నితిన్, సారలమ్మ పూజారి అయిన కాక సారయ్య ఇండ్ల వద్ద డోలు వాయిద్యాల నడుమ మామిడాకు తోరణాలను కట్టారు. అక్కడినుం డి పూజారులు ఆడపడుచులు (ఆడబిడ్డలు) పూజా సామగ్రితో మంగళ హారతులతో ఆయా గుడులకు చేరుకున్నారు. ఆడబిడ్డలు అడవి నుంచి తెచ్చిన పుట్ట మన్నుతో గుడులను అలికి ముగ్గులు వేశారు. అనంతరం పూజారులు డోలు వాయిద్యాల నడుమ బొడ్రాయి, ముత్యా లమ్మ, భూలక్ష్మి, మహాలక్ష్మి లకు నూతన వస్త్రా లు పెట్టి పసుపు కుంకుమ పెట్టి కొబ్బరికాయలు కొట్టి పూజలు చేశారు. అక్కడ నుంచి నేరుగా ఆలయం ముందు బురికా స్తంభాలతో తోరణా నికి చీడపీడలు రాకుండా కోడిపిల్ల, సొరకాయ, మిరపకాయ, మామిడి, వేప మండలు కట్టి తోరణం కట్టారు. అనంతరం గ్రామ పొలిమే రలల్లో బూరిక చెట్లతో తోరణాలు కట్టారు. సాయంత్రం డోలు వాయిద్యాల నడుమ గద్దెల వద్దకు చేరుకొని రహస్య పూజలు చేశారు. దీంతో మహాజాతరకు అంతా సిద్ధమ ని పూజారులు తెలిపారు. ఇదిలావుంటే గత వారం రోజులుగా భక్తుల పెద్ద ఎత్తున పోటెత్తారు. భారీగా తరలి వస్తున్నారు. దీంతో పోలీసులు ప్రత్యేక చర్యలు తీసుకున్నారు.

# అలంపూర్ ఎమ్మెల్యేపై దాడి అప్రజాస్వామికం

### ఎంపి మల్లు రవి క్షమాపణలు చెప్పాలి

### మాజీ మంత్రులు హరీష్ రావు, కెటిఆర్‌ల డిమాండ్

**హైదరాబాద్, జనవరి 21 :** అలంపూర్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే విజయుడిపై కాంగ్రెస్ సీనియర్ నేత, నాగర్‌కర్నూల్ ఎంపీ మల్లు రవి దాడిని మాజీ మంత్రులు హరీశ్‌రావు, కెటిఆర్‌లు తీవ్రంగా ఖండించారు. విజయుడిపై కాంగ్రెస్ ఎంపీ మల్లు రవి దుర్భాషలాడుతూ చేయి చేసుకోవడం దారుణం, అప్రజాస్వామికమని వారు విమర్శించారు. ప్రజల చేత ఎన్నికయిన ప్రతినిధిపై దాడి అంటే ప్రజల తీర్పుపైనే దాడి అని స్పష్టం చేశారు. విజయుడిపై ఎంపీ మల్లు రవి దాడిని బీఆర్ఎస్ పార్టీ తీవ్రంగా ఖండిస్తోందని తెలిపారు. మల్లు రవి తక్షణమే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ప్రతిపక్ష ఎమ్మెల్యేను బెదిరించడం, దాడి చేయడమేనా ప్రజాపాలన అని ప్రశ్నించారు. దాడికి పాల్పడిన మల్లు రవిపై క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అలంపూర్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే విజయుడిపై కాంగ్రెస్ సీనియర్ నేత, నాగర్‌కర్నూల్ ఎంపీ మల్లు రవి దాడిని బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రంగా ఖండించారు. ఇది ప్రజాస్వామ్యంపై జరిగిన బహిరంగ దాడి అని పేర్కొన్నారు. ప్రతిపక్షాన్ని భయపెట్టేందుకు, గొంతు నొక్కేందుకు కాంగ్రెస్ నేతలు దిగజారిన రాజకీయానికి ఇది నిదర్శనమని తెలిపారు. ప్రజలతో ఎన్నికైన ఎమ్మెల్యేను అవమానిస్తూ, శారీరక దాడికి దిగడం కాంగ్రెస్ సంస్కృతి ఎంత దిగజారిందో అర్థమవుతుందని కేటీఆర్ మండిపడ్డారు. చట్టం, రాజ్యాంగం, ప్రజాస్వామ్య విలువలపై కాంగ్రెస్‌కు గౌరవం లేదని ఈ ఘటన మరోమారు స్పష్టం చేస్తోందన్నారు. ఈ దాడిని బీఆర్ఎస్ పార్టీ తీవ్రంగా ఖండిస్తోందని తెలిపారు. ఎంపీ మల్లు రవి తక్షణమే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. సీఎం రేవంత్ రెడ్డి నైతిక బాధ్యత వహించి చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతిపక్షాన్ని బెదిరింపులతో కాదు, ప్రజల తీర్పుతోనే ఎదుర్కోవాలని సూచించారు. బీఆర్ఎస్ నాయకులపై దాడులు చేస్తే చూస్తూ ఉరుకోమని హెచ్చరించారు. ప్రజాస్వామ్య పద్ధతుల్లో గట్టిగా ఎదుర్కొంటామని స్పష్టం చేశారు. మంగళవారం జోగులాంబ గద్వాల జిల్లా వడ్డేపల్లి మండలం పైపాడ్ గ్రామంలో సీసీరోడ్ల నిర్మాణానికి ఎంపీ మల్లు రవి, మాజీ ఎమ్మెల్యే సంపత్‌కుమార్‌తో పాటు బీఆర్ఎస్ అలంపూర్ ఎమ్మెల్యే విజయుడు హాజరయ్యారు. భూమిపూజ కార్యక్రమంలో మొదట ఎంపీ కొబ్బరికాయలు కొట్టగా తర్వాత ఎమ్మెల్యే పనులు ప్రారంభించే ప్రయత్నం చేశారు.

## హైదరాబాద్‌లో తొలి బ్యూటీ టెక్ గ్లోబల్ కెపాబిలిటీ సెంటర్

### సిఎం రేవంత్‌తో లోరియల్ సంస్థ సీఈవో భేటీ

**దావోస్, జనవరి 21 :** ప్రపంచంలోనే తొలి బ్యూటీ టెక్ గ్లోబల్ కెపాబిలిటీ సెంటర్ ను హైదరాబాద్లో ఏర్పాటు చేస్తున్నట్లు లోరియల్ సంస్థ ప్రకటించింది. ఈ అత్యాధునిక కేంద్రాన్ని ఈ ఏడాది నవంబర్లో ప్రారంభించనుంది. దావోస్ లో వరల్డ్ ఎకనమిక్ ఫోరమ్‌లో ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి లోరియల్ సీఈవో నికోలస్ హియోరోనిమస్ తో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా జరిగిన చర్చల్లో లో హైదరాబాద్‌లో భారీ పెట్టుబడులతో బ్యూటీ?టెక్ జీసీసీ ఏర్పాటు చేసే నిర్ణయాన్ని వెల్లడించారు. ఈ జీసీసీ ఏర్పాటుతో లోరియల్‌కు గ్లోబల్ ఇన్నోవేషన్, టెక్నాలజీ, డేటా, సప్లై చైన్ కార్యకలాపాలకు హైదరాబాద్ కీలక కేంద్రంగా నిలవనుంది. డిజిటల్ ట్రాన్స్‌ఫర్మేషన్, ఏఐ, అనలిటిక్స్ రంగాల్లో రూపొందించే సాంకేతిక పరిష్కారాలను ప్రపంచవ్యాప్తంగా ఉన్న లోరియల్ యూనిట్లకు అందిస్తామని హియెరోనిమస్ తెలిపారు. దీంతో గ్లోబల్ ఎంటర్‌ప్రైజ్ కార్యకలాపాలకు హైదరాబాద్ ప్రాముఖ్యత మరింత పెరుగనుంది. నవంబర్‌లో జీసీసీ ప్రారంభోత్సవానికి ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి, మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు లను లోరియల్ ఆహ్వానించింది. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ.. లోరియల్ జీసీసీని హైదరాబాద్‌కు తీసుకురావాలన్న ఆలోచనపై ముఖ్యమంత్రి ప్రత్యేక ఆసక్తి చూపారని, ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తుందని చెప్పారు. హైదరాబాద్ పెట్టుబడులకు అనువైన ప్రదేశమని చెప్పారు. మెడ్‌టెక్, హెల్త్‌టెక్ మాత్రమే కాకుండా బ్యూటీ?టెక్ వంటి కొత్త విభాగాల్లోనూ తెలంగాణ ముందుంటోందని మంత్రి అన్నారు. ఇప్పటికే మారియెట్, వ్యాన్ గార్డ్, నెట్ ఫ్లిక్స్, మెక్ డోనాల్డ్స్, హినెకెన్ , జాగర్ , కోస్ట్కో వంటి గ్లోబల్ కంపెనీలు హైదరాబాద్‌లో జీసీసీలను ఏర్పాటు చేశాయన్నారు. తెలంగాణ ఏఐ ఇన్నోవేషన్ హబ్ గురించి ప్రతినిధి బృందం ఈ సందర్భంగా వివరించింది. జీసీసీతో పాటు మాన్యుఫాక్చరింగ్ యూనిట్ ఏర్పాటుకు తెలంగాణలో ఉన్న అవకాశాలను పరిశీలించాలని లోరియల్ను ఆహ్వానించారు. రాష్ట్రంలో ఉన్న మౌలిక వసతు లు, పరిశ్రమల ఎకోసిస్టమ్‌ను దృష్టిలో ఉంచుకుని భవిష్యత్తులో తయారీ రంగంలోనూ పెట్టుబడులు పెట్టేందుకు సిద్ధంగా ఉన్నట్లు హియెరోనిమస్ సానుకూలంగా స్పందించారు.


## తెలంగాణలో క్లీన్ ఎనర్జీ రంగంలో పెట్టుబడి

- 6వేల కోట్ల పెట్టుబడికి స్లోవేకియా సంస్థ అంగీకారం
- సిఎం రేవంత్‌తో సంస్థ ప్రతినిధుల భేటీ

**హైదరాబాద్, జనవరి 21 :** క్లీన్ ఎనర్జీ రంగంలో తెలంగాణ మరో ముందడుగు వేసింది. రూ.6 వేల కోట్ల పెట్టుబడితో స్మాల్ మాడ్యులర్ రియాక్టర్ (ఎస్ఎంఆర్) ఆధారిత విద్యుత్ ప్రాజెక్ట్ అభివృద్ధికి స్లోవాకియాకు చెందిన న్యూక్లర్ ప్రొడక్ట్స్ సంస్థ ముందుకు వచ్చింది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వానికి ఆ సంస్థ ఎక్స్ ప్రెషన్ ఆఫ్ ఇంట్రెస్ట్ (ఈఓఐ) సమర్పించింది. దావోస్‌లో జరిగిన ప్రపంచ ఆర్థిక వేదిక–2026 సమావేశాల సందర్భంగా, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో సంస్థ ప్రతినిధులు భేటీ అయ్యారు. ఈ సమావేశంలో ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, ఐక్యూ క్యాపిటల్ గ్రూప్ ఛైర్మన్ డా. జాన్ బాబిక్, గ్రూప్ సీఈఓ , డైరెక్టర్ అనిల్ కుమార్ బావిసెట్టి, గ్రీన్ హౌస్ ఎన్విరో సీఈఓ , డైరెక్టర్ మొలుగు శ్రీపాల్ రెడ్డి, స్లోవాక్ రిపబ్లిక్ కాన్సుల్ మాటుస్ జెమెస్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. తెలంగాణ ప్రభుత్వం క్లీన్ అండ్ గ్రీన్ ఎనర్జీ ప్రాజెక్టులను ప్రోత్సహించేందుకు సిద్ధంగా ఉందన్నారు. 2047 నాటికి నెట్ జీరో అభివృద్ధి లక్ష్యాన్ని సాధించడంలో సుస్థిర అభివృద్ధే తెలంగాణకు ప్రధానమని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. స్లోవాకియాకు చెందిన ఐక్యూ క్యాపిటల్ , భారత్‌కు చెందిన గ్రీన్ హౌస్ ఎన్విరో సంయుక్త భాగస్వామ్యంలో న్యూక్లర్ ప్రొడక్ట్స్ సంస్థ ఏర్పడిందని.. గరిష్ఠంగా 300 మెగావాట్ల సామర్థ్యంతో తెలంగాణ లో కొత్త విద్యుత్ ప్రాజెక్ట్ ను ఏర్పాటు చేసే అవకాశాలను పరిశీలిస్తోందని తెలిపారు. ఈ ప్రాజెక్ట్ మొత్తం పెట్టుబడి విలువ 600 మిలియన్ యూరోలు అంటే సుమారు రూ.6,000 కోట్లు అని వెల్లడించారు.

# 25న రథసప్తమికి తిరుమలలో ప్రత్యేక వాహన సేవలు

### ఆర్జిత సేవలతో పాటు, విఐపి దర్శనాలు నిలిపివేత




**తిరుమల, జనవరి 21 :** ఈ నెల 25న రథ సప్తమిని వైభవంగా నిర్వహించాలని తితిదే ఈవో అనిల్ కుమార్ సింఘాల్ అధికారులను ఆదేశించారు. తిరుమలలోని అన్నమయ్య భవన్‌లో బుధవారం తితిదే అదనపు ఈవో సి.హెచ్.వెంకయ్య చౌదరితో కలిసి జిల్లా, తితిదే అధికారులతో శాఖల వారీగా సమీక్ష సమావేశం నిర్వహించారు. రథ సప్తమి నేపథ్యంలో స్వామివారి ఆర్జిత సేవలు, ప్రత్యేక దర్శనాలు, కల్యాణోత్సవం, ఊంజల్ సేవ, ఆర్జిత బ్రహ్మోత్సవం, సహస్ర దీపాలంకార సేవలు రద్దు చేశారు. ఎన్ఆర్ఐలు, చంటి బిడ్డల తల్లిదండ్రులు, సీనియర్ సిటిజన్లు, దివ్యాంగుల ప్రివిలేజ్ దర్శనాలూ నిలిపివేస్తున్నట్లు తితిదే వెల్లడించింది. తిరుపతిలో జనవరి 24 నుంచి 26 వరకు స్లాటెడ్ దర్శనం టోకెన్ల జారీని రద్దు చేస్తన్నట్లు పేర్కొంది. ప్రొటోకాల్ ప్రముఖులకు మినహా వీఐపీ బ్రేక్ దర్శనాలు రద్దు చేయడంతోపాటు బ్రేక్ దర్శనాలకు సంబంధించి జనవరి 24న ఎలాంటి సిఫార్సు లేఖలు స్వీకరించబోమని తితిదే తెలిపింది. భద్రత, పార్కింగ్, అన్నప్రసాదాలు, లడ్డూలు, రద్దీ నిర్వహణ, స్వచ్ఛ కార్యక్రమాలు, అత్యవసర సేవల విషయంలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులూ కలగకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. భక్తులను ఆకట్టుకునేలా సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించాలని, గ్యాలరీల్లో, భక్తుల రద్దీ ఎక్కువగా ఉండే ప్రాంతాల్లో ఎల్ఈడీ స్క్రీన్లు ఏర్పాటు చేయాలని తెలిపారు. రథసప్తమి రోజున వాహన సేవల వివరాలు.. ఇలావున్నాయి. తెల్లవారుజామున 5.30 నుంచి 8 గంటల వరకు సూర్యప్రభ వాహనం, ఉదయం 9 నుంచి 10 గంటల వరకు చిన్నశేష వాహనం ఉంటుంది. ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు గరుడ వాహనం తరవాత మధ్యాహ్నం ఒంటి గంట నుంచి 2 గంటల వరకు హనుమంత వాహనం నిర్వహిసతారు. మధ్యాహ్నం 2 నుంచి 3 గంటల వరకు చక్రస్నానం చేపడతారు. సాయంత్రం 4 నుంచి 5 గంటల వరకు కల్పవృక్ష వాహనం, సాయంత్రం 6 నుంచి 7 గంటల వరకు సర్వభూపాల వాహనం, రాత్రి 8 నుంచి 9 గంటల వరకు చంద్రప్రభ వాహనంతో ముగుస్తుంది.

## సరూర్ నగర్ చెరువు పునరుద్దరణ

### హైడ్రా కమిషనర్ రంగనాథ్ వెల్లడి

**హైదరాబాద్, జనవరి 21 :** సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశాలతో సరూర్‌నగర్ చెరువును పునరుద్ధరిస్తామని హైడ్రా కమిషనర్ రంగనాథ్ తెలిపారు. సరూర్‌నగర్ మినీ ట్యాంక్‌బండ్‌ను ప్రభుత్వ అనుమతితో హైడ్రా టేక్ ఓవర్ చేసిందని చెప్పారు. మార్చి నాటికి పూర్తిస్థాయిలో చెరువును అభివృద్ధి చేస్తామన్నారు. బుధవారం ఆయన సరూర్‌నగర్ చెరువును పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. సుమారు 150 ఎకరాల్లో ఉండే చెరువు ప్రస్తుతం 90 ఎకరాలే ఉందన్నారు. గతంలో జరిగిన నిర్మాణాల జోలికి వెళ్లకుండా 90 ఎకరాలను అభివృద్ధి చేస్తామని వెల్లడించారు. చెరువులోకి మురుగు రాకుండా చర్యలు తీసుకుంటామన్నారు.

# లోక్‌పాల్‌తోనే రాజకీయ అవినీతికి అడ్డుకట్ట!




**త్వం శుంఠ అంటే..త్వం శుంఠ అన్నట్లుగా తెలుగు రాష్ట్రాల్లో రాజకీయాలు నడుస్తున్నాయి. అధికారంలో ఉన్నప్పుడు అవినీతికి తెగించడం..వేలకోట్లు సంపాదించడం..అధికారం పోయాక, అధికారంలో ఉన్న పార్టీల అవినీతి గురించి ప్రశ్నించడం చూస్తున్నాం. అధికారంలో ఉన్న వారు, అధికారంలో ఉండి విపక్షం లోకి వచ్చిన వారు చేసిన అవినీతి వల్ల ఇప్పుడు తెలుగు రాష్ట్రాల్లో కోలుకోలేని అప్పుల్లో కూరుకుని పోయాయి. ఇది వాస్తవం. విభజన వల్ల జరిగిన మేలు ఇదే. ఇందుకు నాలుగు పార్టీల నాయకులు బాధ్యులు. బిఆర్ఎస్‌గా మారిన టిఆర్ఎస్, కాంగ్రెస్, తెలుగుదేశం, వైకాపాలు ఈ అప్పులకు బాధ్యత వహించాలి. తెలుగు రాష్ట్రాల అప్పలను ఈ పార్టీల నుంచి వసూలు చేయాలి. అప్పడే ఈ రెండు రాష్ట్రాలు అప్పల ఊబినుండి బయటపడతాయి.**

ఇకపోతే నేతలకు సవాళ్లు విసురకోవడం అలవాటుగా మారింది. అధికారంలో ఉండగా తాము చేసిన తప్పులను కప్పి పుచ్చుకునేందుకు, ఇప్పుడు అధికారంలో ఉన్న పార్టీలను నిందస్తున్నారు. ఇందులో ఎవ్వరేమీ తక్కువ తినలేదు. అందుకే రాజకీయ అవినీతిపై ఉన్నతస్థాయి దర్యాప్తు జరగాలి. సాధారణ పోలీసులతో ఇది సాధ్యం కాదు. ప్రత్యేక వ్యవస్థను రూపొందించాలి. అన్నా హజారే కోరినట్లుగా లోక్‌పాల్ వ్యవస్థను తీసుకుని రావాలి. అప్పుడే స్వతంత్ర దర్యాప్తు కొనసాగుతుంది. అవినీతిపై నిగ్గు తేలుస్తారు. రాజీకయ పార్టీలు అవినీతికి పాల్పడితే కఠిన చర్యలకు చట్టాలు తేవాలి. ప్రస్తుత సమాజంలో బాగా వేళ్లూనుకున్న అవినీతి ఎక్కడయినా ఉందంటే అది రాజకీయ పార్టీల్లోనే. పటిష్ట లోక్‌పాల్ వ్యవస్థ ద్వారానే అవినీతి నేతలను శిక్షించగలం. అందుకు ప్రజా ఉద్యమాలు రావాలి. ఆప్ ఉద్యమంలా కాకుండా ప్రజలు, మేధావులు కలసి ఉద్యమించాలి. ఇక తెలుగు రాష్ట్రాల విషయాలకు వస్తే జగన్, వైకాపా అవినీతిపై ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు. కెసిఆర్, ఆయన కుటుంబం, బిఆర్ఎస్ నేతల అవినీతిపైనా చర్యలు ముందుకు సాగడం లేదు. తాజాగా కాంగ్రెస్ అవినీతి బట్టబయలు అయ్యింది. ఈ క్రమంలో వీరి అవినీతిపై చర్యలు ఉంటాయనుకోవడం కూడా అత్యాశే అవుతుంది. తెలంగాణ రాజకీయాలను కుదిపేస్తున్న ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో సిట్ తన దర్యాప్తును ముమ్మరం చేసింది. రెండేళ్లుగా సాలీడు దారంలా సాగుతోంది. ఇందులో భాగంగా తాజాగా మాజీ మంత్రి హరీష్‌రావును సిట్ అధికారులు 7 గంటలపాటు విచారించారు. సిట్ విచారణపై ఇప్పుడు బిఆర్ఎస్ నేతలు ఎదురుదాడికి దిగుతున్నారు. రేవంత్ రెడ్డి నీకు దమ్ముంటే నాకు నోటీసులు ఇవ్వడం కాదని, రాజకీయంగా కొట్లాడుదాం అని హరీష్ రావు సవాల్ విసిరారు. కాళేశ్వరం సహా అనేక అవినీతి కేసులు ఉన్నా ఆ పార్టీ నేతలు బరితెగించి మాట్లాడుతున్నారు. వారి అవినీతిని ప్రశ్నిస్తున్న అధికార కాంగ్రెస్ నేతలు తామూ అవినీతి బురదలో కూరుకు పోయారు.

ఒక్కో మంత్రి మీద ఒక్కో అవినీతి బయటపడుతోంది. దీనినిబట్ట అవినీతి రాజకీయ పార్టీల హక్కుగా మారిందని అర్థం చేసుకోవాలి. ఫోన్ ట్యాపింగ్, ఈ కార్ రేసు, కాళేశ్వరం వంటివననీ పిచ్చుకుంట్ల, లొట్టపీసు కేసులని బిఆర్ఎస్ వాదిస్తోంది. కాగ్రెస్ పై ప్రజలు తిరగబడే రోజులు దగ్గర లోనే ఉన్నాయని హరీష్ రావు వ్యాఖ్యానించడం, ఆయన తప్పించుకునే రాజకీయ తెలివిని ప్రదర్శించారని గుర్తించాలి. ఇకపోతే సింగరేణి సంస్థ నిబంధనలు మార్చి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తన బావమరిదికి రూ.1,600 కోట్ల టెండర్లు కట్టబెట్టారని బిఆర్ఎస్ నేతలు ఆరోపిస్తున్నారు. బొగ్గు కుంభకోణంపై నిగ్గు తేల్చడం కోసం సీబీఐతో విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ సర్కార్ అనేక కుంభకోణాలకు పాల్పడిందని, రాష్ట్రాన్ని అధోగతి పాలు చేసిందని మండిపడ్డారు. మంత్రుల వద్ద వాటాల పంచాయితీ నడుస్తున్నదని దుయ్యబట్టారు. గతంలో సింగరేణిపై ఏ ప్రభుత్వం కూడా అజమాయిషి చేయలేదని, కానీ, రేవంత్ సర్కార్ మాత్రం అజమాయిషీ చేస్తూ, తద్వారా సంస్థను నిర్వీర్యం చేస్తున్నదని దుయ్యబట్టారు. మొత్తానికి వజ్రాన్ని వజ్రంతోనే కోయాలని అంటారు. అవినీతి ఆరోపణలను అవినీతి ఆరోపణలతో తిప్పికొట్టడం ఇప్పుడు రాజకీయ పార్టీలకు అలవాటుగా మారింది. సింగరేణి సంస్థకు నష్టం చేకూరేలా చేస్తున్నారన్న ఆరోపణలు వచ్చినప్పుడు దానిని సరిదిద్దుకొని సంస్థ ఖజానాకు గండి పడకుండా చర్యలు తీసుకోవాల్సిన బాధ్యత అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీది. సింగరేణిపై కాంగరెస్, బిఆర్ఎస్ పార్టీలు గద్దల్లా పడి దోచుకుంటున్నారని బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్రరావు ఆరోపించారు. బొగ్గు మంత్రిగా ఉన్నా కిషన్ రెడ్డి ఏం చేస్తున్నట్లు అన్నది చెప్పాలి. కేంద్రం నిజాయితీగా ఎందుకు వ్యవహరించడం లేదు.

అవినీతిపరులను ఎందుకు బోను ఎక్కించడం లేదు. ఇవన్నీ శేష ప్రశ్నలు. సాధారణ టెండర్లలోనూ బిడ్ వేసే ముందు కాంట్రాక్టర్లు పనిచేసే ప్రాంతాన్ని సందర్శించి టెండర్ నోటిఫికేషన్‌లో పేర్కొన్న వివరాలతో బేరీజు వేసుకుంటారు. ప్రీబిడ్ సమావేశంలో తమ అనుభవాలు, సమస్యలు, అభ్యంతరాలను అధికారుల ముందు ఉంచి పరిష్కారాలు, వెసులుబాట్లను ప్రతిపాదిస్తారు. కానీ సింగరేణి టెండర్లు మైనింగ్‌కు సంబంధించినవై నందున భౌగోళిక పరిస్థితులతో ముడిపడి ఉంటుంది. అవినీతి వ్యవహారాలు పునరావృతం కాకుండా ఉండాలంటే కచ్చితంగా టెండర్ నోటిఫికేషన్‌లోనే కొత్త షరతులు పెట్టాల్సి ఉంటుంది. ఒడిశా అంగూల్ జిల్లాలోని నైని కోల్‌బ్లాక్‌ను 2015లో దక్కించు కున్న సింగరేణి సంస్థ, 2200 ఎకరాల విస్తీర్ణంలోని ఆ బ్లాకులో 200 ఎకరాల విస్తీర్ణానికి బీఆర్ఎస్ హయాంలోనే టెండర్లు పూర్తి చేసి, పనులు అప్పగించింది. కాంపిటీటివ్ బిడ్డింగ్ విధానంలో ఐదేండ్ల పాటు బొగ్గు వెలికితీతకు పిలిచిన ఆ టెండర్లలో ఐదు సంస్థలు పోటీపడ్డాయి. చివరికి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డికి చెందిన వీపీఆర్ సంస్థ టెండర్ దక్కించుకున్నది. రోజుకు 30వేల క్యూబిక్ మీటర్ల ఓబీని ఈ సంస్థ వెలికి తీస్తున్నది. అతను కూడా రాజకీయ పార్టీకి చెందిన వాడే ఆవడంతో అవినీతికి ఆస్కారం ఏర్పడింది. టెండర్ విధానాన్ని పారదర్శకంగా నిర్వహించాలనుకుంటే సైట్‌ను పరిశీలించిన ప్రతి కంపెనీకి ఇప్పటికే సర్టిఫికెట్లు జారీ చేయాల్సి ఉన్నది. ఆ మేరకు సుశీ కంపెనీతో పాటు పలు కంపెనీలు కూడా పదేపదే అధికారులకు ఫోన్ చేసి తమకు సర్టిఫికెట్ జారీ చేయాలని కోరుతున్నా అధికారులు జారీ చేయలేదంటే.. ప్రభుత్వ పెద్దల ఆదేశాల కోసం వేచి చూస్తున్నారనేది బహిరంగ రహస్యం. అయితే నైనీ టెండర్లకు సంబంధించి అసలు ఈ సర్టిఫికెట్ ఎవరు జారీ చేయాలనే దానిపైనా సింగరేణిలో స్పష్టత లేదనే ప్రచారం జరుగుతుందంటే ప్రక్రియ ఎంత గుడ్డిగా కొనసాగుతున్నదో అర్థం చేసుకోవచ్చు. ఈ వ్యవహారంలో విచారణ జరగాలి. కాంగ్రెస్ రెండేళ్ల పాలనలో వస్తున్న ఆరోపణలపై విచారణ జరగాలి. బిఆర్ఎస్ పదేళ్ల పాపాలపైనా విచారణ సాగాలి. చంద్రబాబు, జగన్ పాపాలపైనా విచారణ జరగాలి. అందుకు లోక్‌పాల్ ఒక్కటే శరణ్యం.

# ఒకేరోజు ముగ్గురు రైతుల ఆత్మహత్య

- తెలంగాణ దుర్భర పరిస్థితులకు నిదర్శనం
- ప్రభుత్వ తీరుపై మండిపడ్డ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్
- రైతులకు 25 లక్షల చొప్పన ఎక్స్‌గ్రేషియా డిమాండ్



**హైదరాబాద్, జనవరి 21 :** తెలంగాణలో ఒకే రోజు ముగ్గురు అన్నదాతలు ఆత్మహత్య చేసుకోవడం అత్యంత ఆందోళనకరమని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆవేదన వ్యక్తం చేశారు. సమైక్యరాష్ట్రంనాటి సంక్షోభ పరిస్థితులు తెలంగాణవ్యాప్తంగా నెలకొని ఉన్నాయనడానికి వేర్వేరు ప్రాంతాల్లో జరిగిన ఈ ఘటనలే నిదర్శనమని అన్నారు. ఆదిలాబాద్, మెదక్, జయశంకర్ భూపాలపల్లి జిల్లాల్లో ముగ్గురు రైతుల నిండు ప్రాణాలను పొట్టన పెట్టుకున్న పాపం ముమ్మాటికీ ఈ చేతకాని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిదే అని మండిపడ్డారు. భూపాలపల్లిలో కోడెల సదానందం, మెదక్ లో దేవ్ సోత్ సర్వేశ్, ఆదిలాబాద్ లో జాదవ్ అంకుష్ కుటుంబాలకు ప్రభుత్వం వెంటనే 25 లక్షల ఎక్స్ గ్రేషియా చెల్లించి ఆదుకోవాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. ఈ ముగ్గురు రైతుల ఆత్మహత్యలకు అప్పులే ప్రధాన కారణం కావడం, రేవంత్ సర్కారు మోసాలను, అబద్ధపు హామీల పేరిట చేసిన తీరని ద్రోహాన్ని అడుగడుగునా ఎత్తిచూపుతోందని అన్నారు. రుణమాఫీ పేరిట చేసిన నయవంచనకు తోడు, పెట్టుబడి సాయానికి పాతరేయడం, చివరికి యూరియాను కూడా ఎగ్గొట్టి దిగుబడిని దెబ్బతీయడంతో కాంగ్రెస్ పాలనలో తెలంగాణ అన్నదాత పరిస్థితి అనాథలా మారిందని అన్నారు. కేవలం రెండేళ్ల కాలంలోనే దాదాపు 900 మంది రైతులు గుండెపగిలి బలవన్మరణాలకు పాల్పడినా ఈ సన్నాసి సర్కారుకు ఇప్పటికీ సోయి రాలేదని కేటీఆర్ మండిపడ్డారు. పదేళ్లు ధైర్యంగా బతికిన రైతు కుటుంబాల్లో ఇవాళ మోగుతున్న ఈ మరణమృదంగానికి రేవంత్ సర్కారు భారీ మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు. అన్నదాతలారా.. దయచేసి ధైర్యం కోల్పోకండి. మరో మూడేళ్లు ఓపిక పట్టండని సూచించారు. ఈ వ్యవసాయ వ్యతిరేక కాంగ్రెస్ పార్టీని, రైతు ద్రోహి రేవంత్ ను గద్దెదించుదామని.. మన తెలంగాణలో వ్యవసాయరంగానికి మళ్లీ మంచిరోజులు తెచ్చుకుందామని అన్నారు. వివరాల్లోకి వెళితే.. అప్పుల బాధతో ముగ్గురు రైతులు ఆత్మహత్య చేసుకున్నారు. ఈ విషాద ఘటనలు జయశంకర్ భూపాలపల్లి, మెదక్, ఆదిలాబాద్ జిల్లాల్లో చోటుచేసుకున్నాయి. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. భూపాలపల్లి జిల్లా కాటారం గ్రామానికి చెందిన కోడెల సదానందం (42) పోతులవాయి శివారులో తనకున్న 4 ఎకరాల్లో పత్తి పంట సాగుచేశాడు. పెట్టుబడుల కోసం తెచ్చిన రూ.2 లక్షలకుపైగా అప్పు అలాగే ఉండిపోయింది. అప్పులు తీర్చేమార్గం లేక తీవ్ర మనోవేదనకు గురవుతున్నాడు. ఈ నేపథ్యంలో సోమవారం రాత్రి ఇం ట్లో ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మంగళవారం స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. మృతుడికి భార్య రమ, ఇద్దరు పిల్లలు ఉన్నారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్టు కాటారం ఎస్సై శ్రీనివాస్ తెలిపారు.మెదక్ జిల్లా కౌడిపల్లి మండలం బతుకమ్మతండాకు చెందిన రైతు దేవ్‌సోత్ సర్వేశ్ (57) తనకున్న ఎకరం ఐదు గుంటల పొలంలో బోరు వేశాడు. ఇల్లు కట్టి, ఇద్దరు కుమారుల పెండ్లి చేయడానికి రూ.8 లక్షల వరకు అప్పు చేశాడు. అప్పులు ఎక్కువయ్యే సరికి వాటిని ఎలా తీర్చాలో తెలియక మానసికంగా కుంగిపోయాడు. ఈ క్రమంలో ఈనెల 11న పెద్దకొడుకు అనిల్‌కు ఫోన్‌చేసి గడ్డిమందు తాగినట్టు చెప్పాడు. వెంటనే నర్సాపూర్ ప్రభుత్వ దవాఖానకు, అక్కడ నుంచి హైదరాబాద్‌లోని గాం ధీ దవాఖానలో చేర్పించారు. చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఆదిలాబాద్ జిల్లా బేల మండలం పి ట్‌గావ్ గ్రామానికి చెందిన రైతు జాదవ్ అంకుష్ (33) తనకున్న మూడెకరాల్లో పత్తి, కంది సాగు చేశాడు. ఇందుకోసం అప్పులు తీసుకున్నాడు. అప్పులు ఎలా తీర్చాలో తెలియక మానసిక వేదనకు గు రైన అంకుష్ ఈనెల 18న పురుగుల మందు తాగాడు. కుటుంబ సభ్యులు ఆదిలాబాద్‌లోని రిమ్స్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతుండగా పరిస్థితి విషమించి మంగళవారం మధ్యాహ్నం మృతి చెందాడు.

# బేగంపేట ఫ్లై ఓవర్‌పై కారు బోల్తా



**నలుగురికి గాయాలు.. డ్రైవర్ పరార్**

**హైదరాబాద్, జనవరి 21 :** హైదరాబాద్‌లోని బేగంపేట ఫ్లైఓవర్ పై కారు బోల్తా పడింది. మితిమీరిన వేగంతో వచ్చిన ఓ కారు అదుపుతప్పి రోడ్డు డివైడర్‌ను ఢీకొట్టి బోల్తాపడింది. ఈ ఘటనలో నలుగురికి గాయాలయ్యాయి. కారును నడిపిన డ్రైవర్ అక్కడి నుంచి పరారయ్యాడు. ప్రమాదం గురించి సమాచారం అందుకున్న ట్రాఫిక్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. గాయపడిన వారిని సమీపంలోని ఆసుపత్రికి తరలించారు. రోడ్డుకు అడ్డంగా కారు బోల్తా పడటంతో భారీగా ట్రాఫిక్ సమస్య ఏర్పడింది. కారును పక్కకు తీసి, ట్రాఫిక్‌ను పోలీసులు క్లియర్ చేశారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు.

# ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో మున్సిపల్ కసరత్తు

- మూడు పార్టీల్లోనూ పెరిగిన ఆశావహులు
- సమాచర సేకరణతో వడపోతలో పార్టీలు

**నిజామాబాద్, జనవరి 21 :** ఉమ్మడిజిల్లాలో మున్సిపల్ ఎన్నికల రాజకీయాలు వేడెక్కాయి. గెలుపే లక్ష్యంగా ప్రధాన పార్టీలు వ్యూహాలు రచిస్తున్నాయి. నిజామాబాద్ కార్పోరేషన్‌తో పాటు బోధన్, ఆర్మూర్, భీంగల్ మున్సిపాలిటీల్లో పట్టుకు ప్రయత్నాలు మొదలయ్యాయి. మూడు ప్రధాన పార్టీలు ఎవరికి వారు కసరత్తు మొదలు పెట్టారు. అయితే అన్ని పార్టీల్లోనూ ఆశావహులు ఎక్కువగానే ఉన్నారు. ఎవరికి వారు తమ ప్రయత్నాల్లో ఉన్నారు. అధజకార కాంగ్రెస్ పార్టీలో పోటీ పెరగింది. మున్సిపల్ ఎన్నికలకు ఇన్‌ఛార్జ్‌గా మంత్రి ఉత్తమ్ నియామకం కావడంతో ఇప్పుడు నేతలంతా ఆయనను ప్రసన్నం చేసుకునే పనిలో ఉన్నారు. ఈ మేరకు కొందరు నేతలు హైదరాబాద్‌కు కూడా క్యూ కట్టారని సమాచారం. అభ్యర్థుల ఎంపికలో జాగ్రత్తలు తీసుకుంటే విజయం సాధించవచ్చన్న అంచనాతో ముఖ్య నేతలు కసరత్తు చేస్తున్నారు. టికెట్ల కోసం ఆశావహులు పెద్ద సంఖ్యలో దరఖాస్తులు చేసుకోవడంతో రాజకీయ వాతావరణం మరింత వేడెక్కింది. నగర పాలక సంస్థ పరిధిలో 600లకు పైగా దరఖాస్తులు రాగా, బోధన్, ఆర్మూర్, భీంగల్ మున్సిపాలిటీల నుంచి 400లకు పైగా అందాయి. ప్రతి డివిజన్, వార్డు నుంచి ముగ్గురు పేర్లను బీజేపీ హైకమాండ్‌కు పంపడానికి సర్వే చేపట్టారు. గెలిచే సీట్లను అంచనా వేస్తూ మజ్లిస్ అభ్యర్థులను రెడీ చేస్తున్నది. బీఆర్ఎస్ పట్టణ మీటింగ్‌లతో కేడర్‌లో కదలిక తేవడానికి ప్రయత్నిస్తున్నది. మాజీ మంత్రి వేముల ప్రశాంత రెడ్డి ప్రధానంగా పార్టీ కేడర్‌ను ఉత్సాహ పరుస్తున్నారు. మున్సిపల్ ఎన్నికల షెడ్యూల్ ఒకటి రెండు రోజుల్లో విడుదలయ్యే సూచనల నేపథ్యంలో, జిల్లా కాంగ్రెస్ పార్టీ పిలుపు మేరకు ఆశావహులు భారీగా దరఖాస్తులు సమర్పించారు. నగరంలోని 60 డివిజన్లు, బోధన్, ఆర్మూర్, భీంగల్ మున్సిపాలిటీల్లోని 86 వార్డుల్లో ప్రతి వార్డుకు పదికి మించి దరఖాస్తులు వచ్చాయి. ప్రతి డివిజన్, వార్డు నుంచి ముగ్గురు అభ్యర్థుల పేర్లను హైకమాండ్‌కు పంపనున్నారు. పార్లమెంట్ సెగ్మెంట్ ఇన్‌చార్జి మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తో చర్చించేందుకు జిల్లా కాంగ్రెస్ నేతలు హైదరాబాద్‌కు వెళ్లనున్నారు. నగర పాలక సంస్థపై దృష్టి సారించిన బీజేపీ ఆశావహుల నుంచి 500లకు పైగా అప్లికేషన్లు స్వీకరించింది. ఇన్‌చార్జిలుగా వచ్చిన ప్రభాకర్, కాంతారావు ప్రక్రియను పర్యవేక్షించారు. ప్రతి డివిజన్‌కు ముగ్గురు అభ్యర్థులను సర్వే ద్వారా ఎంపిక చేసి స్టేట్ కమిటీకి పంపాలని నిర్ణయించారు. ఈ క్రమంలో ఏర్పాటు చేసిన కోర్ కమిటీలో ఎంపీ అర్వింద్, అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ, పార్టీ జిల్లా అధ్యక్షుడు దినేశ్?ఉన్నారు. బోధన్, ఆర్మూర్, భీంగల్ మున్సిపాలిటీల్లోనూ ఇదే విధానాన్ని అమలు చేయనున్నారు. గత ఎన్నికల్లో నగర పాలక సంస్థలోని 60 డివిజన్లలో 16 డివిజన్లు గెలిచిన మజ్లిస్ ఈసారి 20 డివిజన్లలో విజయం సాధించాలని లక్ష్యంగా పెట్టుకుంది. అభ్యర్థుల ఎంపిక ప్రక్రియ పూర్తి చేసి అధిష్టాన ఆమోదానికి పంపింది. బోధన్ మున్సిపాలిటీలోని 38 వార్డుల్లో 16 స్థానాలను టార్గెట్‌గా పెట్టుకున్న మజ్లిస్, ఆర్మూర్, భీంగల్‌లో అభ్యర్థుల ఎంపికపై కసరత్తు చేస్తోంది. పోటీ చేయని చోట్ల కాంగ్రెస్‌కు మద్దతు ఇవ్వాలనే ఆలోచనలో ఉంది. మున్సిపల్ ఎన్నికలపై ఆసక్తి తగ్గిన కేడర్‌ను చైతన్యపర్చేందుకు బీఆర్ఎస్ నేతలు సమావేశాలు నిర్వహిస్తున్నారు. సోమవారం బోధన్‌లో, మంగళవారం నగరంలో పార్టీ సమావేశాలు నిర్వహించి కేడర్‌లో కదలిక తీసుకురావడానికి ప్రయత్నించారు. బిజెపి ఎంపి ధర్మపురి అర్వింద్, ఇతర బిజెపి ఎమ్మెల్యేలు కూడా క్షేత్రస్థాయిలో సమాచార సేకరణ చేపట్టారు. గెలుపు గుర్రాలను అన్వేషిస్తున్నారు. మొత్తంగా మూడు పార్టీలు పోటాపోటీగా కసరత్తు చేస్తున్నాయి.

# మావోయిస్టు అడ్డాలో పోలీసుల పాగా

**కర్రెగుట్టలో వెలిసిన సిఆర్‌పిఎఫ్ క్యాంప్**



**ములుగు, జనవరి 21 :** దశాబ్దాలుగా మావోయిస్టులకు సురక్షిత ప్రాంతంగా, వారి ఆయుధ కర్మాగారాలకు , ముఖ్య నాయకులకు షెల్టర్ జోన్‌గా ఉన్న ములుగు జిల్లా వెంకటాపురం మండలంలోని కర్రెగుట్ట అటవీ ప్రాంతం ఇప్పుడు పోలీసుల అధీనంలోకి వచ్చింది. కేంద్ర ప్రభుత్వం తీసుకున్న మావోయిస్టు రహిత భారత్ లక్ష్యంలో భాగంగా, వెంకటాపురం మండలం పామునూరు గ్రామ పరిధిలోని కర్రెగుట్టలపై నూతనంగా ఎఫ్.ఓ.బి బేస్ క్యాంప్‌ను అధికారులు ప్రారంభించారు. సి.ఆర్.పి.ఎఫ్ 39వ బెటాలియన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ బేస్ క్యాంప్‌ను సి.ఆర్.పి.ఎఫ్ ఐజీ త్రివిక్రమ్ అధికారికంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఇది దేశ భద్రతా చరిత్రలో ఒక గొప్ప రోజని అభివర్ణించారు. తెలంగాణ ప్రభుత్వ చొరవతో, మురుమూరు బేస్ క్యాంప్ ఏర్పాటు చేసిన కేవలం రెండు నెలల వ్యవధిలోనే దుర్భేద్యమైన కర్రెగుట్టలపై పట్టు సాధించి ఈ రెండో క్యాంప్‌ను ఏర్పాటు చేయడం విశేషమని ఆయన కొనియాడారు. ఈ బేస్ క్యాంప్ ఏర్పాటు వెనుక అధికారుల , ఇంజనీర్ల అలుపెరగని కృషి దాగి ఉంది. వాజేడు మండలం మొరుమూరు బేస్ క్యాంప్ నుండి కర్రెగుట్టల వరకు సుమారు 8.3 కిలోమీటర్ల మేర దట్టమైన అటవీ ప్రాంతంలో రహదారిని నిర్మించారు. భారీ యంత్రాలు, క్రైన్ల సహాయంతో గుట్టలపై విశాలవంతమైన రహదారిని నిర్మించడానికి అధికారులు సుమారు 50 రోజుల పాటు అహోరాత్రులు శ్రమించారు. ఈ రహదారి నిర్మాణం పూర్తి కావడంతో ఇప్పుడు బలగాల రాకపోకలు సులభతరం కావడమే కాకుండా, మావోయిస్టుల కదలికలకు అడ్డుకట్ట పడింది. బేస్ క్యాంప్ ప్రారంభం అనంతరం ఐజీ విక్రమ్ పామునూరు గ్రామస్తులతో ముచ్చటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రానున్న రోజుల్లో జెల్లా, డోలి, తడపాల మీదుగా మరిన్ని రహదారులు నిర్మించి బేస్ క్యాంప్‌లను ఏర్పాటు చేస్తామని వెల్లడించారు. మావోయిస్టుల ముఖ్య క్యాడర్ ఇప్పటికే లొంగిపోయారని, ప్రస్తుతం కొన్ని చిన్న పార్టీలు మాత్రమే మిగిలి ఉన్నాయని ఆయన పేర్కొన్నారు. వారు కూడా తెలంగాణ పోలీసులు పిలుపునిచ్చిన 'పోరు కన్నా ఊరు మిన్న' కార్యక్రమం ద్వారా లొంగిపోయి, ప్రభుత్వం కల్పిస్తున్న పునరావాసాన్ని అందిపుచ్చుకుని జనజీవన స్రవంతిలో కలవాలని ఆయన పిలుపునిచ్చారు. కర్రెగుట్టల నుంచి పలు గ్రామాల దిశగా రహదారి పనులు చకచకా సాగుతుండటంతో స్థానిక గిరిజన గ్రామాల్లో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. రవాణా సౌకర్యాలు మెరుగుపడటంతో పాటు ప్రభుత్వ పథకాలు నేరుగా తమ దరికి చేరుతాయని గ్రామస్తులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. పోలీసుల రాకతో భద్రతా భావం పెరిగిందని, కర్రెగుట్టలు ఇకపై మావోయిస్టుల స్థావరాలుగా కాకుండా అభివృద్ధికి కేంద్రాలుగా మారుతాయని అధికారులు ధీమా వ్యక్తం చేస్తున్నారు.

# సనాతన ధర్మంపై ఉదయనిధి వ్యాఖ్యలు

**ముమ్మాటికీ విద్వేషపూరితమే అన్న మద్రాస్ హైకోర్టు**

**చెన్నై, జనవరి 21 :** తమిళనాడు ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి స్టాలిన్ 2023లో సనాతన ధర్మంపై చేసిన వ్యాఖ్యలు ముమ్మాటికీ విద్వేష పూరితమైనవే అని మద్రాస్ హైకోర్టు తప్పుపట్టింది. ఉదయనిధి చేసిన వ్యాఖ్యలు అప్పట్లో తీవ్ర దుమారం రేపిన సంగతి తెలిసిందే. తాజాగా దీనిపై మద్రాస్ హైకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. సనాతన ధర్మంపై ఉదయనిధి వ్యాఖ్యలు విద్వేషపూరిత ప్రసంగమేనని వ్యాఖ్యానించింది. ఉదయనిధి వ్యాఖ్యలను విమర్శిస్తూ.. భాజపా నేత అమిత్ మాలవీయ సోషల్ మీడియాలో పోస్టు పెట్టడంపై దాఖలైన కేసును హైకోర్టు కొట్టేసింది. ఉదయనిధి 2023లో చేసిన వ్యాఖ్యలను వ్యతిరేకిస్తూ.. మాలవీయ చేసిన పోస్టు నేరం కిందకు రాదని పేర్కొంది. సనాతన ధర్మాన్ని అనుసరించేవారే లక్ష్యంగా చేసిన రెచ్చగొట్టే ప్రసంగానికి అది ప్రతిస్పందన మాత్రమేనని స్పష్టం చేసింది. ఉదయనిధి ఉపయోగించిన పదజాలంపై అసహనం వ్యక్తంచేస్తూ.. ఆయన చేసిన వ్యాఖ్యలు విద్వేష పూరిత ప్రసంగం కిందకే వస్తాయని పేర్కొంది. తమిళనాడులో మంత్రి చేసిన వ్యాఖ్యలపై ఎలాంటి కేసు నమోదు కాలేదని, ఇతర రాష్ట్రాల్లో కొన్ని కేసులు నమోదైన విషయాన్ని ప్రస్తావించింది. సెప్టెంబరు 2023లో తమిళనాడులో జరిగిన ఓ కార్యక్రమంలో ఉదయనిధి మాట్లాడుతూ.. 'సనాతన ధర్మాన్ని నిర్మూలించాలి' అని వ్యాఖ్యానించారు. ఇది సామాజిక న్యాయానికి వ్యతిరేకమని పేర్కొన్నారు. దీనిపై అప్పట్లో దేశవ్యాప్తంగా దుమారం చెలరేగింది.

# మంగళగిరి ప్రాంతంలో గంజాయి ముఠా అరెస్ట్

**గుంటూరు, జనవరి 21 :** మంగళగిరి గ్రామీణ పరిధిలో గంజాయి విక్రయాలకు పాల్పడుతున్న గ్యాంగ్‌ను మంగళగిరి పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ మేరకు గుంటూరు జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ బుధవారం మీడియాకు వివరాలు వెల్లడించారు. మంగళగిరి పట్టణ పరిధిలో గంజాయి విక్రయాలు జరుగుతున్నాయన్న రాబడిన సమాచారం మేరకు ప్రత్యేక దాడులు నిర్వహించామని, ఈ దాడుల్లో మొత్తం 15 మందిని అరెస్ట్ చేసినట్లు తెలిపారు. అరెస్ట్ అయిన వారిలో 7గురు గంజాయి విక్రయదారులు, మిగిలిన 8 మంది గంజాయి వినియోగదారులుగా గుర్తించినట్లు చెప్పారు. నిందితుల వద్ద నుంచి మొత్తం 4.2 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. అరెస్ట్ అయిన వారిలో విజయవాడ, దుగ్గిరాల, మంగళగిరి, కాజా, తదితర ప్రాంతాలకు చెందిన వారు ఉన్నారని ఎస్పీ వెల్లడించారు. గంజాయిని విక్రయించడమే కాకుండా వినియోగించడమూ నేరమేనని ఎస్పీ వకుల్ జిందాల్ స్పష్టం చేశారు. గంజాయి కేసుల్లో ప్రతి ఒక్కరిపై కఠిన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని, తప్పనిసరిగా జైలు శిక్ష అనుభవించాల్సి ఉంటుందని హెచ్చరించారు. గత నాలుగు నెలల కాలంలోనే 220కు పైగా గంజాయి కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. గంజాయి మత్తు వల్ల యువత భవిష్యత్తు నాశనమవుతుందని పేర్కొంటూ, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, గంజాయి విక్రయాలు లేదా వినియోగంపై సమాచారం ఉంటే వెంటనే పోలీసులకు తెలియజేయాలని ఎస్పీ సూచించారు. ఎస్పీ తో పాటు మంగళగిరి గ్రామీణ సీఐ ఏవీ బ్రహ్మం, గ్రామీణ ఎసచవతీచ చిరుమామిళ్ల వెంకట్ పాల్గొన్నారు.



## కాంగ్రెస్ పార్టీలో చేరి తప్పు చేశాను

### పటాన్ చెరువు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి

**పటాన్ చెరువు, రాజముద్ర న్యూస్ :** పటాన్ చెరువు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి ఇటీవల సంచలన వ్యాఖ్యలు చేశారు. బీఆర్ఎస్ పార్టీ మూడుసార్లు ఎమ్మెల్యే టికెట్ ఇచ్చింది, ఈ నియోజకవర్గ ప్రజలు కూడా నన్ను ఆశీర్వదించి హ్యాట్రిక్ ఎమ్మెల్యేగా చేశారు. కన్న తండ్రి లాంటి బీఆర్ఎస్ పార్టీని వదిలి, కాంగ్రెస్ పార్టీలో చేరితే ఈ పటాన్ చెరువు నియోజకవర్గ ప్రజలకు గాని, నాకు వ్యక్తిగతంగా కాని వెంట్రుక మందమైనా ఉపయోగం జరగలేదని గూడెం మహిపాల్ రెడ్డి ఇటీవల వ్యాఖ్యానించారు.

**బీఆర్ఎస్ పార్టీలో తిరిగి గూడెంను చేర్చుకుంటుందా..?**

పటాన్ చెరువు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి ఇటీవల చేసిన వ్యాఖ్యలతో నియోజకవర్గంలోని బిఆరఎస్ శ్రేణులు అలర్ట్ అయ్యాయి. ఎలాగైనా సొంతగూటికి వెళ్లాలని ఆలోచనతో ఉన్న గూడెం మహిపాల్ రెడ్డి హరీష్ రావు తన పట్ల సానుకూలంగా ఉన్నట్లు, కేటీఆర్ అపాయింట్మెంట్ ఇస్తే నేను తప్పు చేశానని ఒప్పుకుంటానని తెలిపే అవకాశం ఉందని ఎమ్మెల్యే అనుచరులు చెబుతున్నారు.

**గతంలో కేటీఆర్ ఏమన్నారు.**

బిఆర్ఎస్ పార్టీని వీడి కాంగ్రెస్ పార్టీలో చేరిన ఎమ్మెల్యేలను ఎట్టి పరిస్థితులలో తిరిగి బీఆర్ఎస్ పార్టీలో చేర్చుకోబోమని చాలా సందర్భాలలో కేటీఆర్ తెలిపిన సంగతి తెలిసిందే. ప్రస్తుతం పటాన్చెరువు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి తిరిగి సొంతగూటికి వచ్చే ఆలోచనలో ఉన్న సందర్భంలో హరీష్ రావు ఓకే చెప్పినట్టు, కేటీఆర్ అపాయింట్మెంట్ కోసం పడి కాపులు కాస్తున్నట్టు తన అనుచర వర్గాలు చెబుతున్న మాట నిజమేనా..? అయితే గతంలో గూడెం మహిపాల్ రెడ్డి పార్టీ మారిన తర్వాత పటాన్చెరు నియోజకవర్గం బి ఆర్ ఎస్ పగ్గాలు ఆదర్శ్ రెడ్డి కి ఇవ్వడం జరిగింది. ఇప్పుడు ఎమ్మెల్యే సొంత గూటికి వస్తే ఆదర్శ రెడ్డి స్థానం ఎక్కడ? రాబోయే కొన్ని రోజులలోనే పటాన్ చెరువు నియోజకవర్గం లోని బి ఆర్ ఎస్ పార్టీలో ఏమి జరగబోతుందో అని నియోజకవర్గ ప్రజలు ఎదురుచూస్తూ గమనిస్తున్నారు.



## గ్రామ సంఘం ఆధ్వర్యంలో సర్పంచ్‌కి సన్మానం

**రామారెడ్డి, రాజముద్ర న్యూస్ :** రామారెడ్డి మండలం గోకుల్ తండా ఐకెపి గ్రామ సంఘం ఆధ్వర్యంలో సర్పంచ్ కేతావత్ మోహన్ , ఉప సర్పంచ్ మేఘవత్ మంజుల, వార్డ్ సభ్యులు బాధవత్ రమేష్, బాధవత్ సాంకు బాయ్, కాట్రోత్ రవి, బాధవత్ సునీత, గ్రామ సంఘం సభ్యులు ఘనంగా సన్మానించడం జరిగింది, ఈ కార్యకమం లో సీసీ అబ్బ లింగం, వివో ఏ ఏ అమీనా, గ్రామ సంఘం అధ్యక్షురాలు బాధవత్ భారతి, సంఘ సభ్యులు పాల్గొన్నారు.



## రామారెడ్డిలో ఉచిత పశు వైద్య శిబిరం

**రామారెడ్డి, రాజముద్ర న్యూస్ :** రామారెడ్డి మండలం లో బుధవారం రోజున మార్కెట్ కమిటీ సదాశివ నగర్ ఆధ్వర్యంలో ఉచిత పశు వైద్య శిబిరం నిర్వహించారు, ఈ కార్యక్రమంలో సర్పంచ్ బండి ప్రవీణ్, మార్కెట్ కమిటీ ఏఎంసీ చైర్మన్గ్ సంగ్య నాయక్, డైరెక్టర్ ఎండి రావుఫ్, మాజీ సర్పంచ్ రంగు రవీందర్ గౌడ్, పశుపతి, డైరెక్టర్లు, వెటర్నరీ డాక్టర్ రామచంద్రం, పశు వైద్య సిబ్బంది, గ్రామ పెద్దలు, పాడి రైతులు, గొర్రెల పెంపకం దారులు, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.




## ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తేనే ప్రాణాలకు భద్రత

### నవాబుపేట్ ఎస్ఐ జీ.పుండ్లిక్

**వికారాబాద్, రాజముద్ర న్యూస్ :** రోడ్డు ప్రమాదాల వల్ల అమూల్యమైన ప్రాణాలు కోల్పోతున్న నేపథ్యంలో ప్రతి వాహనదారుడు ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని నవాబుపేట్ ఎస్ఐ జీ.పుండ్లిక్ అన్నారు. రోడ్డు భద్రత మాసోత్సవాల్లో భాగంగా బుధవారం నవాబుపేట్ మండల కేంద్రంలో నిర్వహించిన రహదారి భద్రత– జీవితానికి రక్షణ పై ప్రజలకు ఎస్ఐ జీ. పుండ్లిక్ అవగాహన కల్పించి మాట్లాడారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలన్నారు. నాలుగు చక్రాల వాహనదారులు సీటు బెల్ట్ వినియోగించాలని సూచించారు. అతివేగంతో వాహనాలు నడపడం,మద్యం సేవించి డ్రైవింగ్ చేయడం, మొబైల్ ఫోన్ ఉపయోగించడం ప్రమాదాలకు దారితీస్తుందని హెచ్చరించారు. ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించడం వల్లే ఎక్కువగా రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని తెలిపారు. రోడ్డుపై ప్రమాదానికి గురైన వారిని చూస్తే రోడ్డుపై అలాగే వదిలేయకుండా వెంటనే సమీప దవాఖానకు తరలించి చికిత్స అందేలా చూడాలని, ఆ సమాచారాన్ని వెంటనే పోలీసులకు తెలియజేయాలని సూచించారు. గాయపడిన వారిని 'గోల్డెన్ అవర్'లో అంటే గంటలోపే దవాఖానకు చేర్చితే ప్రాణాలు కాపాడవచ్చని ఆయన తెలిపారు. ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘిస్తే ప్రమాదాలే కాకుండా చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రతి వాహనదారుడు తన కుటుంబం,తన భవిష్యత్‌ను దృష్టిలో పెట్టుకుని భాద్యతాయుతంగా వాహనాలు నడపాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది,వాహనదారులు, మండల ప్రజలు,తదితరులు పాల్గొన్నారు.

### ప్రభుత్వం అందిస్తున్న వ్యవసాయ పరికరాల

## రాయితీని రైతులు పొందాలి

### వికారాబాద్ జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్



**వికారాబాద్, రాజముద్ర న్యూస్ :** ప్రభుత్వం రాయితీపై అందజేస్తున్న వ్యవసాయ పరికరాలను రైతులు పొందాలని వికారాబాద్ జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ తెలిపారు. బుధవారం వికారాబాద్ కలెక్టరేట్ ఆవరణలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో వ్యవసాయ యాంత్రీకరణ పథకం ద్వారా రాయితీపై వ్యవసాయ పరికరాల పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టడం జరిగింది. వ్యవసాయ పరికరాల నిమిత్తం దరఖాస్తు చేసుకున్న 43 మంది రైతులకు జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ చేతుల మీదుగా రొటావేటర్, కల్టివేటర్, తైవాన్ స్ప్రేయర్లను అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా రైతులను ఉద్దేశించి కలెక్టర్ మాట్లాడుతూ... రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయ యాంత్రికరణ పథకం ద్వారా రాయితీపై వ్యవసాయ పరికరాలను అందించడం జరుగుతుందని, రైతులు ఈ సదావకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. రైతులు వ్యవసాయానికి వాడుకునే పరికరాల కొనుగోలుకు ఇబ్బంది పడుతున్న నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం రాయితీపై వ్యవసాయ పరికరాలతో పాటు పిచికారి యంత్రాలను కూడా అందజేయడం జరుగుతుందని కలెక్టర్ తెలిపారు. అర్హులైన రైతులు వ్యవసాయ పరికరాల నిమిత్తం దరఖాస్తు చేసుకోవాలని అదేవిధంగా చిన్న సన్నకారు రైతులు కూడా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి రాజారత్నం, జిల్లా ఉద్యానవన అధికారి సత్తార్, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ లు శ్రీనివాస్, మహేందర్ రెడ్డి, అంజయ్య, విజయ భాస్కర్ రెడ్డి, వ్యవసాయ శాఖ అధికారులు పాల్గొన్నారు.

### సమాచార హక్కు చట్టంపై

## ఎందుకీ నిర్లక్ష్య వైఖరి

- రాష్ట్ర సమాచార కమిషన్ ఆదేశాలు 'భే'ఖాతరు
- సంవత్సరాలు గడిచినా ఇవ్వని పౌర సమాచారం
- చివరి అవకాశంగా 15 రోజుల గడువు హెచ్చరిక
- కార్యదర్శుల పై సెక్షన్ 20 ప్రకారం చర్యలకు సిఫారసు

**ఖమ్మం, రాజముద్ర న్యూస్ :** సామాన్యులకి వజ్రాయుధమైన సమాచార హక్కు చట్టం 2005 దరఖాస్తుల పట్ల కొందరు ఉద్యోగులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. పాలనలో పారదర్శకత, జవాబుదారీతనం కోసం తీసుకువచ్చిన సమాచార హక్కు చట్టం 2005 నుండి తప్పించుకునే ప్రయత్నంలో చట్టాన్ని పదే పదే ఉల్లంఘిస్తున్నారు. నేలకొండపల్లి మండలానికి చెందిన ఓ ఆర్టీఐ కార్యకర్త సమాచారం కోరుతూ మండలంలోని చెరువుమాదారం, రావిగూడెం గ్రామ పంచాయితీలకు అదే విధంగా ముదిగొండ మండలంలోని ముదిగొండ, వల్లభి, యడవల్లి గ్రామ పంచాయితీలకు దరఖాస్తు చేసుకున్నారు. దరఖాస్తులను స్వీకరించిన సహాయ పౌర సమాచార అధికారులైన పంచాయితి కార్యదర్శులు ఆర్టీఐ కార్యకర్త కోరిన సమాచారం మాత్రం ఇవ్వలేదు. దీంతో సదరు ఆర్టీఐ కార్యకర్త 29 అక్టోబర్ 2022 న రాష్ట్ర సమాచార కమీషన్ కు అప్పీలు చేశారు. ఈ అప్పీలు ను స్వీకరించిన కమీషన్ ఫిర్యాదు సంఖ్య 410,3451,3476,5791,8968 ఎసఐసి – జిఎసఎన్/2022 అదే విధంగా 419,5793/ఎసఐసి – జిఎసఎన్/2022 ను నమోదు చేసుకుని దరఖాస్తుదారుడు కోరిన సమాచారం తక్షణమే ఇవ్వాలని ఆదేశిస్తూ సంబంధిత సహాయ పౌర సమాచార అధికారిలకు 29 డిసెంబర్ 2022న విడిగా లేఖలను పంపారు.

**రాష్ట్ర సమాచార కమిషన్ ఆదేశాలు 'భే'ఖాతరు**

రాష్ట్ర సమాచార కమీషన్ లేఖలను స్వీకరించిన ఆయా గ్రామాల పంచాయితీ కార్యదర్శులు కమీషనర్ ఆదేశాలను భేఖాతరు చేస్తూ కనీస సమాచారం కూడా ఇవ్వలేదు. ఈ నేపథ్యంలో ఆర్టీఐ కార్యకర్త మరోసారి సమాచార కమిషన్ కి ఫిర్యాదు చేయగా దరఖాస్తుదారు కోరిన సమాచారం, సంబంధిత రికార్డులను సిద్ధం చేసుకుని 24 సెప్టెంబర్ 2025 న రాష్ట్ర సమాచార కమిషనర్ పీవీ.శ్రీనివాసరావు ఎదుట ప్రత్యక్షంగా హాజరుకావాలని ముదిగొండ(రామకృష్ణ), వల్లభి(మురళీకృష్ణ), యడవల్లి(కళ్యాణి), రావిగూడెం (పిట్టల హనుమంతరావు)చెరువుమాధారం(బోడ బాషా) కార్యదర్శులకి నోటీసులు పంపించారు. ఈ నోటీసులను స్వీకరించిన కార్యదర్శులు కమీషనర్ ఆదేశాలను ధిక్కరిస్తూ కమీషనర్ ఎదుట ప్రత్యక్ష విచారణకు గైర్హాజరయ్యారు.

ఈ విషయం పై ఆగ్రహం వ్యక్తం చేసిన సమాచార కమీషన్ ఫిర్యాదు సంఖ్య 20045/ఎసఐసి–పివిఎసఆర్/2022,20046/ఎసఐసి–పివిఎసఆర్/2022,24 సెప్టెంబర్ 2025 ను నమోదు చేసుకుని 12 జనవరి 2026 న మరొక లేఖను పంపించారు. ఈ లేఖలో లేఖను స్వీకరించిన 15 రోజుల్లోగా రిజిష్టర్ పోస్టు,అకనాలెడ్జ్మెంట్ ద్వారా ఆర్టీఐ కార్యకర్త కోరిన సమాచా రం వివరాలను అందించి,సమాచార కమిషన్ కి సైతం లేఖ ను పంపించాలని ఆదేశాలను జారీ చేశారు. లేని యెడల స మాచార హక్కు చట్టం 2005 ను అనుసరించి సెక్షన్ 20 ప్రకారం కార్యదర్శులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

## ఫోన్ చేస్తే ఇంటికే పోలీస్


- బాధితుల ఇంటివద్ద నుండే ఎఫ్.ఐ.ఆర్ నమోదు
- సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి
- సూర్యాపేట ఎస్పి కె.నరసింహ



**సూర్యాపేట, రాజముద్ర న్యూస్ :** ఫోన్ చేస్తే ఇంటికే పోలీసులు వచ్చి పిర్యాదులు స్వీకరించి కేసులు నందు చేసి భరోసా కల్పించడం కోసం సూర్యాపేట జిల్లా పోలీసు శాఖ కృషి చేస్తుంది, పోలీస్ స్టేషన్ కు రాలేని ప్రత్యేక పరిస్థితుల్లో, ఇబ్బందుల్లో ఉన్న బాధితుల నుండి సమాచారం అందుకున్న వెంటనే బాధితుల వద్దకు వెళ్ళి పిర్యాదు స్వీకరించి అక్కడి నుండే కేసు నమోదు చేసి బరోసా కల్పించాలని, పోలీసు సేవల్లో పారదర్శకత కోసం తెలంగాణ రాష్ట్ర పోలీసు శాఖ అమలులోకి తెచ్చిన నూతన ప్రణాళిక కార్యాచరణను రాష్ట్ర డిజిపి ఆదేశాల మేరకు జిల్లాలో పటిష్టంగా అమలు చేస్తామని జిల్లా ఎస్పి నరసింహ తెలిపారు. ఈ ప్రణాళిక ప్రకారం ముఖ్యంగా శారీరక దాడులు గురైయ్యే వారికి,ఎస్సి ఎస్టీ వర్గాల ప్రజలకు, బాలలకు, ర్యాగింగ్ కు గురయ్యే విద్యార్థులకు, వేధింపులకు గురయ్యే మహిళలకు, బాలలకు ఎంతో సహాయపడనుంది అన్నారు. దీని ప్రకారం అన్ని పోలీసు స్టేషన్ల సిబ్బందికి, అధికారులకు ఆదేశాలు ఇవ్వడం జరిగినది అని తెలిపారు. తెలంగాణ పోలీస్ శాఖ ప్రజలకు మరింత సులభమైన సేవలు అందించేందుకు మరో కీలక సంస్కరణకు శ్రీకారం చుట్టింది అన్నారు, ఇకపై పోలీస్ స్టేషన్‌కు వెళ్లాల్సిన అవసరం లేకుండా బాధితులు తమ ఇంటి వద్ద నుంచే ఫిర్యాదు చేసుకునే అవకాశం కల్పిస్తోంది, ఈ ప్రణాళిక మేరకు పోలీస్ స్టేషన్‌కు రాలేని పరిస్థితుల్లో ఉన్నవారి ఇంటికే పోలీసులు వెళ్లి ఫిర్యాదులు స్వీకరిస్తానని తెలిపినారు. వృద్ధులు, మహిళలు, దివ్యాంగులు, అనారోగ్యంతో ఉన్నవారు లేదా భద్రతా కారణాల వల్ల బయటకు రాలేని బాధితులకు ఈ రకమైన సేవలు ఉపయోగపడతాయని అన్నారు. ఫోన్ కాల్, ఆన్‌లైన్ అభ్యర్థన లేదా ఇతర మార్గాల ద్వారా సమాచారం అందగానే సంబంధిత పోలీస్ సిబ్బంది బాధితుల నివాసానికి చేరుకుని ఫిర్యాదు నమోదు చేస్తామని తెలిపినారు. ఈ విధానం ద్వారా ఫిర్యాదుల నమోదు ప్రక్రియ మరింత వేగవంతమవడంతో పాటు పోలీస్ వ్యవస్థపై ప్రజల నమ్మకం పెరుగుతుందని తెలిపారు. ముఖ్యంగా శారీరక దాడులు, అట్రాసిటీ నిరోధక చట్టం కేసులు, బాల్య వివాహాలు, ర్యాగింగ్ నిరోధక చట్టం, మైనర్ వేదింపులు, గృహహింస వంటి కేసుల్లో బాధితులకు ఇది ఎంతో సహాయపడనుంది తెలిపారు

## సర్వీస్ పర్సన్‌కు ఆరు వేల వేతనం అందించాలి

### ఎల్ఎఫ్ఎల్ హెచ్ఎం అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు వివి నాయక్



**సూర్యాపేట,రాజముద్ర న్యూస్ :** ప్రాథమిక పాఠశాలలో జూలై 2005 నాటికి 31 మంది పైబడి విద్యార్థులు ఉన్న పాఠశాలల సర్వీస్ పర్సన్ లకు వేతనం .ఆరు వేలు అందించాలని ఎల్ఎఫ్ఎల్ హెచ్ఎం అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు వాంకుడోత్ వెంకన్న నాయక్ ప్రభుత్వాన్ని కోరారు. బుధవారం ఎల్ఎఫ్ఎల్ హెచ్ఎం కు ఎదుర్కొంటున్న పలు సమస్యలను పరిష్కరించాలని కోరుతూ జిల్లా విద్యాశాఖ అధికారి కే అశోక్ కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవిలో కెపాసిటీ బిల్డింగ్ ట్రైనింగ్ పొందిన ఉపాధ్యాయులకు ఈఎలఎస్ మంజూరు ప్రొసీడింగ్ ఇవ్వాలన్నారు. 2026 సంవత్సరంలో ఉద్యోగ విరమణ పొందుతున్న ఎల్ఎఫ్ఎల్ హెచ్ఎం ల జాబితాను రూపొందించాలని కోరారు. ప్రాథమిక పాఠశాలల బలోపేతం కోసం ఏర్పాటు చేసిన తనిఖీ బృందాలను పునరుద్ధరించాలని అన్నారు. గ్రామపంచాయతీ ఎన్నికల్లో ప్రభుత్వ సెలవు దినాల్లో మూడు విడతల్లో పనిచేసిన ఉపాధ్యాయులకు సిసిఎల్ మంజూరు చేయాలని అన్నారు. అపరిష్కృతంగా ఉన్న ఎల్ఎఫ్ఎల్ హెచ్ఎం ల సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు తొగరు రామయ్య, జిల్లా ఉపాధ్యక్షులు మద్రు శ్రీనివాస్ రావు, జిల్లా కార్యదర్శులు బానోతు వెంకన్న, రామ్మూర్తి, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.



## నిధుల దుర్వినియోగంపై విచారణ

**బీర్కూర్, రాజముద్ర న్యూస్ :** బీర్కూర్ మండలం చించోలి గ్రామ మాజీ సర్పంచ్ పెరిక అంబయ్య పై అదే గ్రామానికి చెందిన అమ్ముల కిషన్ ఈనెల ఐదున ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ కు నిధుల దుర్వినియోగం పై ఫిర్యాదు చేశారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు బాన్సువాడ డి ఎల్ పి ఓ ప్రసాద్ బుధవారం చించోలి గ్రామ పంచాయితికి వచ్చి మాజీ సర్పంచ్ పెరిక అంబయ్య, గత సెక్రటరీ నవీన్ పై విచారణ చేపట్టారు. ఈ సందర్భంగా డిఎల్పిఓ ప్రసాద్ మాట్లాడుతూ గత ఐదు సంవత్సరాల కాలంలో జిపి అకౌంట్ నుంచి జరిగిన లావాదేవీలను మొత్తం పరిశీలించి, తదుపరి నివేదికను జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ అందజేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీనిధి, ప్రజా ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.



## అంబులెన్స్ ఆకస్మిక తనిఖీ

**పొతంగల్, రాజముద్ర న్యూస్ :** పొతంగల్‌లో 108 అంబులెన్సు వాహనాన్ని అకస్మిక తనిఖీ చేసిన ప్రోగ్రాం మేనేజర్ జనార్ధన్. బుధవారం పొతంగల్ అంబులెన్స్ ను ఆకస్మిక తనిఖీ చేసి అందులో నిలువచేసే మందులను మరియు పరికరాలను రికార్డులను క్షుణంగా పరిశీలించారు. అంతేకాకుండా రోజు జరుగుతున్న కేసులను ట్రీట్మెంట్ ఏ విధంగా జరుగుతుంది అని ఈఎంటి కే నారాయణ ను పైలట్ ఎండి కలీంను అడిగి తెలుసుకున్నారు. పోతంగల్ మండలం చుట్టుపక్కల గ్రామాల నుంచి వస్తున్న కేసులను వారికి ఇచ్చిన ట్రీట్మెంట్ ఏ విధంగా జరుగుతుందని అడిగి తెలుసుకున్నారు. అంబులెన్స్ లో ఉన్న రికార్డులను క్షుణంగా పరిశీలించి ఎప్పటికప్పుడు నిల్వ ఉన్న మందులను పరిశీలించి కాలం చెల్లిన మందులను పరిశీలించారు. చుట్టుపక్కల గ్రామాల నుంచి వస్తున్న కేసులను త్వరగా తీసుకొని ఇన్ టైం లో విధంగా అంతేకాకుండా హాస్పిటల్ కి త్వరగా తరలించే విధంగా చూడాలని పైలెట్ కి ఇఎంటికి సూచనలు ఇవ్వడం జరిగింది. అంబులెన్స్ లో నిల్వ ఉన్న పరికరాలను పనితీరును పరిశీలించడం జరిగింది.



## మృతుని కుటుంబానికి ఆర్థిక సహాయం

**ఆత్మకూర్ (ఎం). రాజముద్ర న్యూస్:** ఇటీవలే గత కొద్దిరోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ స్వర్గస్తులైనటువంటి ఇంజమూరి రాములు కుటుంబ సభ్యులను కలిసిన ఆత్మకూర్(ఎ) మండల సర్పంచుల ఫోరం అధ్యక్షులు లింగరాజు పల్లి గ్రామ సర్పంచ్, వైయస్సార్ ఫౌండేషన్ అధినేత, యెర్ర సోమిరెడ్డి వారి కుటుంబాన్ని పరమర్శించి వారికి మనోధైర్యాన్ని అందించి (10,000/- రూపాయలు) ఆర్థిక సహాయం చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో హాజరైన వారు: ఉప సర్పంచ్ ఇంజమూరి బిక్షపతి, వార్డ్ మెంబర్స్: ఎడ్ల యకమ్మ,కావటి మల్లేష్, దుర్గం మల్లేష్ గ్రామ పెద్దలు: కావటి స్వామి, ఎర్ర లింగారెడ్డి, మెట్టు కృష్ణ రెడ్డి, మరియు పడకంటి వెంకటయ్య, మల్లేపల్లి శంకర్, ఎడ్లకాడి కాశి, ఇంజమూరి నాగరాజ్, భూషి మహేష్, భూషి శివ, తదితరులు పాల్గొన్నారు.



## పుల్లాయిగూడెం మహిళా సంఘం భవనానికి పిజిజిఆర్ స్థలం విరాళం

**ఆత్మకూర్( ఎం). రాజముద్ర న్యూస్ :** యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూర్( ఎం) మండలం పుల్లాయిగూడెం గ్రామ పంచాయతీలో మహిళా సంఘం భవన నిర్మాణానికి ఎదురైన స్థలం సమస్య పరిష్కారమైంది. గ్రామానికి మహిళా సంఘం భవనం మంజూరైనప్పటికీ, తగిన ప్రభుత్వ స్థలం అందుబాటులో లేకపోవడంతో భవన నిర్మాణం నిలిచిపోయింది. ఈ విషయాన్ని గమనించిన ప్రస్తుత సర్పంచ్, నరాంల రామలింగయ్య ఉప సర్పంచ్ తండ రమేష వివో ఏ జీడిమల్ల సునీత మహిళా సంఘం అధ్యక్షురాలు ఆవుల పద్మ మహిళ సభ్యులు బండారు సరోజన బండారు సత్తమ్మ అంతిరెడ్డి వజ్రమ్మ బత్తినిపులమ్మ మరియు గ్రామ సెక్రటరీ. శ్రీనివాస్ గ్రామస్తులు బండి ఉప్పలయ్య గౌడ్ మాజీ సర్పంచ్ పెసరు గిరిజా గోపాల్ రెడ్డి.ని సంప్రదించి మహిళా సంఘం భవనంకు స్థలం కావాలని కోరారు. గ్రామ అభివృద్ధిపై ఉన్న మక్కువతో గిరిజా గోపాల్ రెడ్డి. తక్షణమే స్పందించి, తన ఇంటి పక్కనే ఉన్న విలువైన సొంత ఖాళీ స్థలాన్ని మహిళా సంఘం భవన నిర్మాణానికి విరాళంగా ఇచ్చేందుకు అంగీకరించారు. తమ తల్లిదండ్రుల జ్ఞాపకార్థం, వారిపై ఉన్న మమకారంతో ఈ భవనానికి వారి పేరు పెట్టాలని ఆయన కోరారు. సొంత భూమిని గ్రామం కోసం విరాళంగా ఇచ్చిన లిపెసరు గిరిజా గోపాల్ రెడ్డి. కి కృతజ్ఞతలు ఈ భవనం అందుబాటులోకి వస్తే గ్రామంలోని మహిళల అభ్యున్నతికి, వారి సమావేశాలకు ఎంతో దోహదపడుతుందని గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. నిస్వార్థంగా స్పందించిన మాజీ సర్పంచ్ పెసరు గిరిజా గోపాల్ రెడ్డి. కుటుంబ సభ్యులకు గ్రామస్తులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.



## సునీతా విలియమ్స్ రిటైర్మెంట్

**యూఎస్ :** భారత సంతతికి చెందిన ప్రముఖ నాసా వ్యోమగామి సునీతా విలియమ్స్ కీలక నిర్ణయం తీసుకున్నారు. నాసా నుంచి రిటైర్ అవుతున్నట్లు ప్రకటించారు. కాగా, గతేడాది డిసెంబరు 27 నుంచే ఇది అమల్లోకి వచ్చిందని తాజాగా నాసా పేర్కొంది. 60 ఏళ్ల సునీత 1998లో నాసాలో చేరారు. 27 ఏళ్ల సుదీర్ఘ ప్రయాణంలో భాగంగా ఆమె మొత్తం మూడుసార్లు అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రానికి వెళ్లారు. 2024 జూన్ 5న సునీత, మరో వ్యోమగామి బుచ్ విల్మోర్‌లు వారంరోజుల రోదసి యాత్ర చేపట్టారు. అయితే, సాంకేతిక సమస్య వల్ల వారు దాదాపు 9 నెలలపాటు అంతరిక్షంలోనే ఉండిపోవాల్సి వచ్చింది. దీంతో ఈ అంతరిక్షయానం ప్రపంచవ్యాప్తంగా అందరి దృష్టినీ ఆకర్షించింది. ఇక, సునీత మొత్తం 608 రోజులు అంతరిక్షంలోనే ఉన్నారు. తొమ్మిదిసార్లు స్పేస్‌వాక్ చేశారు. భారత సంతతికి చెందిన న్యూరోఅనాటమిస్ట్ దీపక్ పాండ్యా, స్లొవీన్ అమెరికన్ ఉర్సులైన్ బోనీలకు 1965 సెప్టెంబర్ 19న ఒహాయోలో సునీత జన్మించారు. పాండ్యా దంపతులకు ముగ్గురు సంతానం కాగా.. సునీత చిన్న కుమార్తె. దీపక్ పాండ్యా గుజరాత్‌లో జన్మించారు. 1958లో ఆయన అమెరికాకు వలస వెళ్లారు.



## ట్రంప్ 'గాజా శాంతిమండలి'లో చేరతా : నెతన్యాహు

**ఇజ్రాయెల్ :** గాజా పునర్నిర్మాణం కోసం అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ 'శాంతి మండలి'ని ఏర్పాటుచేసిన సంగతి తెలిసిందే. ఇందులో చేరేందుకు తాజాగా ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు అంగీకరించారు. మండలి కూర్పు సరిగా లేదంటూ ఇజ్రాయెల్ తొలుత అసంతృప్తి వ్యక్తంచేసింది. తాజాగా మండలిలో చేరాలంటూ ట్రంప్ చేసిన ఆహ్వానాన్ని అంగీకరిస్తున్నట్లు ఇజ్రాయెల్ ప్రధాని కార్యాలయం ఓ ప్రకటనలో పేర్కొంది. ఇక, గాజాలో శాంతి నెలకొల్పేందుకు ఉద్దేశించి ఏర్పాటుచేసిన ఈ మండలికి ట్రంప్ ఛైర్మన్‌గా వ్యవహరించనున్నారు. ఈ మండలిలో భాగం కావాలని భారత్ సహా పలు దేశాలకు ట్రంప్ ఆహ్వానం పంపించారు. మండలిలో చేరేందుకు యూఏఈ, మొరాకో, వియత్నాం వంటి దేశాలు సుముఖత వ్యక్తం చేయగా.. యూకే, రష్యా, ఈయూ దేశాలు ఇప్పటివరకు దీనిపై స్పందించలేదు. మరోవైపు ఇందులో చేరేందుకు ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మెక్రాన్ తిరస్కరించడంపై ట్రంప్ ఆగ్రహం వ్యక్తంచేశారు. ఈ క్రమంలో ఫ్రాన్స్ వైన్, షాంపైన్‌లపై 200 శాతం టారిఫ్‌లు విధిస్తానని హెచ్చరించారు.

## అవి డీప్‌ఫేక్ వీడియోలు

### రాజ్యసభ ఎంపీ సుధామూర్తి



**న్యూఢిల్లీ :** ప్రస్తుత కృత్రిమమేధ యుగంలో సామాన్యుల నుంచి సెలబ్రిటీల వరకు చాలామంది ఎదుర్కొంటున్న అతిపెద్ద సమస్యల్లో డీప్‌ఫేక్ కూడా ఒకటి. రాజ్యసభ ఎంపీ సుధామూర్తి పెట్టుబడి స్కీమ్‌లను ప్రచారం చేస్తున్నట్లుగా ఉన్న వీడియోలు సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతున్నాయి. తాజాగా దీనిపై సుధామూర్తి స్పందించారు. అవి నకిలీవని, వాటిని నమ్మొద్దని పేర్కొన్నారు. ఎక్స్ వేదికగా ఆమె ఓ వీడియో విడుదల చేశారు. రూ.20వేలు పెట్టుబడి పెడితే.. పది రెట్లు రాబడి వస్తోందంటూ తాను చెప్పినట్లుగా సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న వీడియోలు నకిలీవని సుధామూర్తి పేర్కొన్నారు. ఈ డీప్‌ఫేక్ వీడియోలను చూసి ప్రజలు మోసపోవద్దని కోరారు. వీటిని నమ్మి తనకు తెలిసినవారు డబ్బులు పోగొట్టుకున్నారని వెల్లడించారు. తాను ఎప్పుడూ ఆర్థిక పెట్టుబడుల గురించి మాట్లాడనని, ఇలాంటి వీడియోలతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఇక, గత నెలలో కూడా సుధామూర్తి ఇలాంటి హెచ్చరికలే చేశారు. అధిక రాబడులు పొందడానికి తాను సూచించిన సంస్థల్లో పెట్టుబడులు పెట్టాలంటూ ఆమె చెబుతున్నట్లుగా ఉన్న వీడియో వైరల్ అయ్యింది. అవి ఫేక్ అని, వాటిని నమ్మొద్దని ఆమె పేర్కొన్నారు.

## వైద్యుడి ఘాతుకం..

### డబ్బుల కోసం పెద్దమ్మ, పెదనాన్ననే కడతేర్చాడు

**బెంగళూరు:** ఆ వైద్యుడి ఆలోచన భయానకం. చేసిన అప్పులు తీర్చడానికి ఏకంగా పెద్దమ్మ పెదనాన్నను కడతేర్చాడు. కర్ణాటకలోని శివమొగ్గ జిల్లా భద్రావతి తాలూకా పరిధిలో వృద్ధ దంపతులు చంద్రప్ప, జయమ్మల అనుమానాస్పద మృతి కేసు బుధవారం ఓ కొలిక్కి వచ్చింది. జయమ్మ సోదరి కుమారుడు డా.మల్లేశ్ ఆ ఇద్దరిని కడతేర్చాడని పోలీసు అధికారులు తేల్చారు. సోమవారం రాత్రి వారింటికి వెళ్లిన మల్లేశ్ ఇద్దరినీ మాటలతో మాయ చేసినట్లు గుర్తించారు. తాను ఒక ఇంజక్షన్ ఇస్తానని, దాంతో ఒంటి నొప్పులు మాయం అవుతాయని నమ్మించినట్లు పోలీసులు తెలిపారు. ఈ క్రమంలోనే బెడ్‌రూమ్‌లో ఉన్న చంద్రప్పకు, టీవీ చూస్తున్న జయమ్మకు వేర్వేరుగా ఇంజక్షన్లు వేశాడు. వాటి ప్రభావంతో వారిద్దరూ ప్రాణాలు కోల్పోయారు. అనంతరం అతడు ఇంట్లో ఉన్న నగలు, డబ్బు మూటగట్టుకుని వెళ్లిపోయాడు. మరుసటి రోజు అందరిలాగే మృతదేహాల వద్ద కన్నీరు కార్చాడు. ఆ ఇంటికి ఎవరెవరు వచ్చి వెళ్లారనే విషయాలపై పోలీసులు ఆరా తీశారు. పోస్టుమార్టం రిపోర్ట్ ఆధారంగా మల్లేశ్ హత్య చేసినట్లు గుర్తించి అరెస్టు చేశారు.

# 365 రోజులు విజయాలు

## ట్రంప్ తొలి ఏడాది పాలనపై పోస్ట్

**వాషింగ్టన్ :** అమెరికా అధ్యక్షుడిగా డొనాల్డ్ ట్రంప్ రెండోసారి అధికారం చేపట్టి ఏడాది పూర్తయ్యింది. ఈ సందర్భంగా వైట్‌హౌస్ ట్రంప్‌ను ఉద్దేశిస్తూ ఆసక్తికర పోస్టు చేసింది. ట్రంప్ 365 రోజుల పాలనలో 365 విజయాలు సాధించినట్లు పేర్కొంది. సరిహద్దుల రక్షణ, అమెరికన్ల సత్తాను తిరిగి చాటడం, దేశ ప్రజలకు మొదటి ప్రాధాన్యం ఇవ్వడానికి ట్రంప్ ఇదే రోజున పదవీ బాధ్యతలు చేపట్టారని వైట్‌హౌస్ వెల్లడించింది. కేవలం 365 రోజుల్లోనే.. ఏ దేశాధ్యక్షుడు చేయలేనివిధంగా అద్భుతమైన ఫలితాలు సాధించారని తెలిపింది. ఇక, ఈ ఏడాది పాలనపై వైట్‌హౌస్‌లో ట్రంప్ మీడియాతో మాట్లాడారు. తన పరిపాలనలో అమెరికా ఆర్థికవ్యవస్థ వృద్ధి చెందుతోందన్నారు. ద్రవ్యోల్బణం మునుపటికంటే చాలావరకు తగ్గించామన్నారు. సుంకాలు వసూలు చేస్తున్నామని.. యాపిల్, ఎన్వీడియా, ఫోర్డ్, జనరల్ మోటార్స్, హ్యుందాయ్ వంటి పెద్ద కంపెనీల నుంచి రికార్డు స్థాయిలో పెట్టుబడులు వస్తున్నట్లు తెలిపారు. తన పదవీకాలంలో అమెరికన్ ప్రజల ఆదాయం పెరిగిందన్నారు. ఈ సందర్భంగా మాజీ అధ్యక్షుడు జో బైడెన్ పరిపాలనపై విమర్శలు గుప్పించారు. ఈక్రమంలో గతేడాది ఆపరేషన్ సిందూర్ సమయంలో



భారత్- పాక్ మధ్య నెలకొన్న ఉద్రిక్తతలు అణుయుద్ధంగా మారకుండా తానే నిరోధించానని ట్రంప్ మరోసారి పునరుద్ఘాటించారు. ఈ సందర్భంగా మరోసారి నోబెల్ శాంతి బహుమతి గురించి ప్రస్తావించారు.

## ఇక ఆ దేశాలపై నమ్మకం పెట్టుకోలేం

### కెనడా ప్రధాని మార్క్ కార్నీ





**దావోస్ :** దావోస్‌లో జరుగుతోన్న ప్రపంచ ఆర్థిక సదస్సులో కెనడా ప్రధాని మార్క్ కార్నీ మాట్లాడుతూ.. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ విధిస్తున్న సుంకాలపై పరోక్ష విమర్శలు చేశారు. అమెరికా ఆధిపత్యంలో ప్రపంచం పరివర్తన వైపు కాకుండా విచ్ఛిన్నం వైపు వెళ్తుందన్నారు. ఒకప్పుడు భాగస్వామ్య శ్రేయస్సు కోసం దేశాల మధ్య చేసుకున్న ఆర్థిక ఒప్పందాలను పైస్థానంలో ఉన్నవారు ఇప్పుడు ఆయుధంగా ఉపయోగించుకుంటున్నారన్నారు. బలవంతులు తమ సొంత ప్రయోజనాలకు అనుకూలంగా నిర్ణయాలు తీసుకుంటూ.. అసమానమైన వాణిజ్య నియమాలను అమలుచేస్తున్నారని మండిపడ్డారు. ఇంతకాలం భౌగోళిక పరిస్థితులు, ప్రపంచదేశాలతో పొత్తులు మాత్రమే దేశ శ్రేయస్సు, భద్రతకు హామీ ఇస్తాయని నమ్మేవాళ్లమని.. ఆ నమ్మకాలు ఇక ఎప్పటికీ తిరిగి రావని అన్నారు. ప్రపంచ దేశాలు ఒకదానిపై ఒకటి ఆధారపడితే ఎటువంటి సమస్యలు వస్తాయో ఇటీవల తలెత్తిన ఆర్థిక, ఇంధన, భౌగోళిక రాజకీయ సంక్షోభాలు తెలియజేశాయని కార్నీ అన్నారు. ముఖ్యంగా ప్రపంచంలోని కొన్ని ప్రధాన శక్తులు సుంకాలు, ఆర్థిక వ్యవస్థలు, వాణిజ్య సరఫరా గొలుసులను ఆయుధంగా ఉపయోగించుకొని ఇతర దేశాలపై ఒత్తిడి తీసుకువస్తున్నాయన్నారు. వీటివల్ల కెనడా అనేక చిక్కులు ఎదుర్కొంటోందన్నారు. దీంతో ఇకనైనా ఇతర దేశాలపై ఆధారపడకుండా దేశీయ సామర్థ్యాలను బలోపేతం చేసుకోవడానికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. ప్రపంచ వాణిజ్య సంస్థ, ఐక్యరాజ్యసమితి వంటి సంస్థలు బలహీనపడ్డాయని, అందుకే దేశాలు మరింత స్వతంత్రంగా పని చేయవలసి వస్తుందన్నారు. ఒకే మనస్తత్వం కలిగిన దేశాలు భాగస్వాములుగా మారి.. సౌకర్యవంతమైన సంకీర్ణాలను నిర్మించుకోవాలని ప్రపంచ దేశాలకు కెనడా ప్రధాని పిలుపునిచ్చారు.

### బెదిరింపులు కాదు.. గౌరవం కావాలి: మేక్రాన్

దావోస్ సమావేశంలో ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమాన్యుయేల్ మేక్రాన్ మాట్లాడుతూ.. ట్రంప్ గ్రీన్‌లాండ్‌పై చేస్తున్న బెదిరింపులను వ్యతిరేకించారు. ప్రపంచ దేశాలు బెదిరింపులను, క్రూరత్వాన్ని కోరుకోవట్లేదని.. గౌరవాన్ని, చట్టబద్ధమైన నియమాలను కోరుకుంటున్నాయన్నారు. అంతర్జాతీయ చట్టాలపై యూరప్ దేశాలు నిబద్ధతతో ఉంటాయన్నారు. యూరోపియన్ ఎగుమతులను దెబ్బతీసే ఒప్పందాలను వాషింగ్టన్ అనుసరిస్తోందని మండిపడ్డారు. సుంకాలతో ఇతర దేశాలపై ఒత్తిడి తీసుకురావడం సరైన చర్య కాదన్నారు.

## ఫిబ్రవరి 3న తెరుచుకోనున్న రాష్ట్రపతి భవన్ 'అమృత్ ఉద్యాన్'

**న్యూఢిల్లీ :** రాష్ట్రపతి భవన్‌లోని అతి సుందరమైన 'అమృత్ ఉద్యాన్' ప్రజల సందర్శనార్థం తెరుచుకోనుంది. ఫిబ్రవరి 3 నుంచి మార్చి 31 వరకు అవకాశం కల్పించనున్నట్లు రాష్ట్రపతి భవన్ బుధవారం వెల్లడించింది. ఉద్యానవనంలో ప్రవేశానికి రాష్ట్రపతి భవన్‌కు సమీపంలో ఉండే గేట్ నంబర్ 35 ద్వారా ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు సందర్శకులకు అనుమతి ఇవ్వనున్నారు. ఉద్యానవనం నిర్వహణ నిమిత్తం అన్ని సోమవారాలు సెలవు ఉంటుంది. మార్చి 4న హోలీ సందర్భంగా సెలవు ప్రకటించారు. అమృత్ ఉద్యానవనాన్ని సందర్శించాలనుకునేవారు రాష్ట్రపతి భవన్ అధికారిక వెబ్‌సైట్‌లో పేర్లు నమోదు చేసుకోవాల్సి ఉంటుంది. 35వ ప్రవేశద్వారం వద్దకు చేరుకున్నాక ఆఫ్‌లైన్ ద్వారా కూడా స్లాట్‌ను బుక్ చేసుకోవచ్చు.



ప్రజల సౌకర్యార్థం సమీప మెట్రోస్టేషన్ నుంచి బస్సు సౌకర్యం కల్పించనున్నారు.

## భారత్‌లో ఉగ్రదాడులకు ప్లాన్!

### నిఘా వర్గాల అలర్ట్

**న్యూఢిల్లీ :** పాకిస్థాన్‌కు చెందిన ఉగ్రవాద సంస్థ జైషే మహ్మద్ భారత్‌లో ఉగ్రదాడులకు ప్లాన్ చేస్తున్నట్లు నిఘా వర్గాలు వెల్లడించాయి. ఇందుకు గణతంత్ర దినోత్సవాన్ని లక్ష్యంగా చేసుకున్నట్లు తెలుస్తోంది. ఆ దేశానికి చెందిన నిఘా సంస్థ ఐఎస్ఐ ఉగ్రవాదులకు సహకరిస్తున్నట్టు నిఘా వర్గాలు పేర్కొన్నాయి. దేశంలోని పలు ప్రాంతాల్లో జనవరి 26న భీకర దాడులకు పాల్పడేందుకు '26-26' అనే కోడ్ నేమ్‌ను పెట్టుకున్నట్లు తెలిపాయి. గణతంత్ర వేడుకలకు అంతరాయం కలిగించాలనే ఉద్దేశంతో దాడులకు దిగవచ్చని తెలిపాయి. నిఘా వర్గాల సమాచారంతో అప్రమత్తమైన అధికారులు సరిహద్దులు సహా జమ్మూ కశ్మీర్, దిల్లీ, పంజాబ్ వంటి కీలక ప్రాంతాల్లో భద్రతా చర్యలను ముమ్మరం చేశారు. ఈ క్రమంలో పలువురు అనుమానితుల ఫొటోలతో దిల్లీ పోలీసులు వాంటెడ్ నోటీసులు జారీ చేశారు. వారిని ఎక్కడైనా గుర్తిస్తే సమాచారం ఇవ్వాల్సిందిగా ప్రజలను కోరారు. సోషల్




మీడియాలో ఉగ్రవాద భావజాలాన్ని ప్రచారం చేస్తున్న కొందరు యువకులను అదుపులోకి తీసుకున్నట్లు అధికారులు వెల్లడించారు. నిందితులు సామాజిక మాధ్యమాలలో విద్వేషపూరిత ప్రసంగాలు చేస్తూ.. జమ్మూ కశ్మీర్, పంజాబ్, దిల్లీ, హరియాణాలోని యువకులను ఉగ్రవాదం వైపు ప్రోత్సహిస్తున్నట్లు గుర్తించామన్నారు.



## నన్ను చంపేస్తే.. మీరు భూమ్మీదే ఉండరు

### ఇరాన్‌కు ట్రంప్ వార్నింగ్

**వాషింగ్టన్ :** ఇరాన్‌ను ఉద్దేశించి అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సంచలన వ్యాఖ్యలు చేశారు. తనపై ఇరాన్ హత్యకు పాల్పడితే.. ఆ దేశాన్ని అమెరికా భూస్థాపితం చేస్తుందని వార్నింగ్ ఇచ్చారు. ఇరుదేశాల మధ్య ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్న సమయంలో ఓ మీడియా సంస్థ ఇంటర్వ్యూలో ట్రంప్ ఈ వ్యాఖ్యలు చేశారు. తనపై ఏదైనా హత్యాయత్నం జరిగి, దాని వెనక ఇరాన్ హస్తం ఉందని తేలితే.. ఆ దేశాన్ని తుడిచిపెట్టేయాలని తన సలహాదారులను ఆదేశించినట్లు ట్రంప్ ఇప్పటికే ఓసారి వ్యాఖ్యలు చేశారు. తాజాగా మరోసారి అదేతరహా హెచ్చరికలు చేశారు. కాగా.. డిసెంబర్ నుంచి పాలకులకు వ్యతిరేకంగా ఇరాన్ ప్రజలు నిరసనలు చేపడుతున్నారు. దీంతో తమ దేశంలో నెలకొన్న ఆందోళనలకు అమెరికా అధ్యక్షుడే కారణమని ఆయతుల్లా అలీ ఖమేనీ ఆరోపించగా.. ఇరాన్‌లో కొత్త నాయకత్వం రావాల్సిన అవసరం ఉందని ఆ నిరసనకారులకు ట్రంప్ మద్దతు పలుకుతున్న సంగతి తెలిసిందే. సుదీర్ఘకాలంగా కొనసాగుతున్న ఖమేనీ పాలన అంతం కావాలని పిలుపునిచ్చారు. ఈ వ్యాఖ్యలపై ఇరాన్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. తమ నాయకుడే లక్ష్యంగా ఏదైనా దురాక్రమణ జరిగితే.. దానిని తాము దీటుగా ఎదుర్కొంటామని హెచ్చరించింది. ఇక ఈ నిరసనల్లో 5వేల మంది మృతి చెందినట్లు వార్తలు వచ్చిన సంగతి తెలిసిందే. 26వేల మంది వరకు అరెస్టయినట్లు ఆ కథనాలు పేర్కొన్నాయి. ఈ మరణాలకు అమెరికానే కారణమని ఖమేనీ నిందించారు.

## దావోస్ వేదికగా మోసాలు..

### ఏకంగా బిలియనీర్లకే బురిడీ..

**దావోస్ :** స్విట్జర్లాండ్‌లోని దావోస్ వేదికగా జరుగుతున్న ప్రపంచ ఆర్థిక సదస్సులో స్కామర్లు రెచ్చిపోయారు. అమెరికాకు చెందిన కీలక వేదికను లక్ష్యంగా చేసుకున్నారు. ఆ దేశ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌తో సమావేశమయ్యేందుకు గానూ అక్కడి 'యూఎస్‌ఏ హౌస్'కు వీఐపీ యాక్సెస్ కల్పిస్తామంటూ బిలియనీర్లకు మాయమాటలు చెప్పారు. వారికి నకిలీ టికెట్లు అమ్మి బురిడీ కొట్టించారు. ఈ వ్యవహారం సదస్సు నిర్వాహకుల దృష్టికి చేరడంతో విజిటర్లను అప్రమత్తం చేశారు. ఆ వీఐపీ యాక్సెస్ ప్యాకేజీలను కొనుగోలు చేయొద్దని హెచ్చరించారు. ఈ ఏడాది నకిలీ పాస్‌ల విక్రయాలు ఎక్కువయ్యాయని పేర్కొన్నారు. దావోస్ హై సెక్యూరిటీ జోన్‌కు సమీపంలో ఉన్న యూఎస్‌ఏ హౌస్‌లో సీఈఓలు, యూఎస్ క్యాబినెట్ సభ్యులు, ఇతర ప్రముఖులు ఉన్నతస్థాయి చర్చల్లో పాల్గొంటుంటారు. బుధవారం ఈ సదస్సులో ట్రంప్ ప్రసంగించనున్నారు. ఇదిలా ఉంటే.. మంగళవారం సాయంత్రమే ట్రంప్ దావోస్‌కు బయల్దేరారు. అయితే విమానంలో సాంకేతిక సమస్య తలెత్తడంతో తిరిగి యూఎస్‌కు వచ్చేశారు. తర్వాత మరో విమానంలో వెళ్లారు. గ్రీన్‌లాండ్ స్వాధీనం ప్రకటనలు, ఐరోపా యూనియన్‌తో విభేదాల వేళ.. అక్కడ ఆయన చేయనున్న ప్రసంగంపై సర్వత్రా ఆసక్తి నెలకొంది.

## మహారాజా ఎక్స్‌ప్రెస్‌కు త్రుటిలో తప్పిన ప్రమాదం

**జైపుర్ :** భారత్‌లో అత్యంత విలాసవంతమైన మహారాజా ఎక్స్‌ప్రెస్‌కు పెను ప్రమాదం తప్పింది. ఈ రైలు మంగళవారం అర్ధరాత్రి జైపుర్ నుంచి సవాయి మాధోపుర్‌కు వెళ్తుండగా.. మార్గమధ్యంలో పట్టాలపై ఉన్న ఇనుప రాడ్లను పైలట్ గుర్తించారు. వెంటనే ఎమర్జెన్సీ బ్రేక్‌లు వేసి రైలు ఆపారు. రైల్వే అధికారులకు సమాచారం అందించడంతో వారు ఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. దాదాపు 5 అడుగుల పొడవు ఉన్న ఇనుప రాడ్లను గుర్తించారు. వీటిని దుండగులు ఉద్దేశపూర్వకంగానే పట్టాలపై పెట్టి ఉంటారని అధికారులు అనుమానిస్తున్నారు. ఘటనాస్థలంలో జాగిలాల సాయంతో తనిఖీలు చేపట్టారు. ఈ ఘటన కారణంగా రైలు దాదాపు అరగంట పాటు నిలిచిపోయింది. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రైల్వే పోలీసులు వెల్లడించారు. ఈ రైల్లో ఎక్కువ మంది విదేశీ ప్రయాణికులు ఉన్నట్లు తెలుస్తోంది.



## ప్రయాగ్‌రాజ్‌లో కూలిన మిలిటరీ శిక్షణ విమానం

**ప్రయాగ్‌రాజ్ :** ఉత్తర్‌ప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్‌లో మిలిటరీ శిక్షణ విమానం కూలింది. సాధారణ శిక్షణలో ఉండగా.. స్థానిక కేపీ కాలేజీ సమీపంలోని చెరువులో ఆర్మీ విమానం కూలినట్లు అధికారులు వెల్లడించారు. ఈ ప్రమాదంలో విమానంలో ఉన్న ఇద్దరు పైలట్లు సురక్షితంగా బయటపడ్డారని తెలిపారు. పౌరుల ఆస్తులకు ఎలాంటి నష్టం వాటిల్లలేదన్నారు. ఘటనాస్థలంలో సహాయక చర్యలు కొనసాగుతున్నాయన్నారు. అయితే ప్రమాదానికి గల కారణాలు ఇంకా తెలియరాలేదు. ఎయిర్ ఫోర్స్‌కు చెందిన శిక్షణ విమానాలు తరచూ ప్రమాదానికి గురవుతుండడానికి గల కారణాలపై దర్యాప్తు చేయాలని ఎయిర్ ఫోర్స్ కోర్టు అధికారులను ఆదేశించింది.

# ఆల్‌టైమ్ కనిష్ఠానికి రూపాయి విలువ



దేశీయ కరెన్సీ రూపాయి పతనం కొనసాగుతోంది. అంతర్జాతీయ విపణిలో డాలరుతో రూపాయి మారకం విలువ ఆల్‌టైమ్ కనిష్ఠ స్థాయికి చేరింది. బుధవారం ఇంట్రాడే ట్రేడింగ్‌లో రూపాయి 91.74 వద్ద కనిష్ఠానికి చేరింది. రూపాయికి ఇప్పటివరకు ఇదే కనిష్ఠ స్థాయి కావడం గమనార్హం. దేశీయ ఈక్విటీ మార్కెట్ల నుంచి విదేశీ మదుపర్లు తమ నిధులు తరలించడం, అమెరికాతో వాణిజ్య ఒప్పందం ఆలస్యం వంటివి సెంటిమెంట్‌ను దెబ్బతీశాయి. అంతర్జాతీయంగా నెలకొన్న అనిశ్చిత పరిస్థితులు కూడా కారణమని అనలిస్టులు పేర్కొంటున్నారు. డిసెంబర్‌లో ఒకసారి 91 మార్కు దాటగా.. తాజాగా మరోసారి ఆల్‌టైమ్ కనిష్ఠ స్థాయిలకు రూపాయి విలువ చేరడం గమనార్హం.




## తొలి టీ20లో న్యూజిలాండ్‌పై
# భారత్ ఘన విజయం

### అభిషేక్ శర్మ మెరుపు ఇన్నింగ్స్

నాగ్‌పుర్: న్యూజిలాండ్‌తో జరిగిన తొలి టీ20 మ్యాచ్‌లో భారత్ 48 పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది. తొలుత బ్యాటింగ్ చేసిన భారత్ 7 వికెట్ల నష్టానికి 238 పరుగులు చేసింది. లక్ష్యఛేదనలో న్యూజిలాండ్ 190/7కి పరిమితమైంది. గ్లెన్ ఫిలిప్స్





(78; 40 బంతుల్లో 4 ఫోర్లు, 6 సిక్సులు) రాణించగా.. మార్క్ చాప్‌మన్ (39), టిమ్ రాబిన్సన్ (21) డరెల్ మిచెల్ (28), శాంట్నర్ (20) రన్స్ చేశారు. భారత బౌలర్లలో వరుణ్ చక్రవర్తి 2, శివమ్ దూబె 2, అర్ష్‌దీప్ సింగ్, హార్దిక్ పాండ్య, అక్షర్ పటేల్ తలో వికెట్ తీశారు. ఈ విజయంతో ఐదు మ్యాచ్‌ల సిరీస్‌లో భారత్ 1-0తో ఆధిక్యంలో నిలిచింది. రెండో టీ20 శుక్రవారం (జనవరి 23)రాయ్‌పూర్‌లో జరగనుంది. భారత బ్యాటర్లలో ఓపెనర్ అభిషేక్ శర్మ (84; 35 బంతుల్లో 5 ఫోర్లు, 8 సిక్సులు) మెరుపు ఇన్నింగ్స్‌తో అలరించాడు. చివర్లో రింకు సింగ్ (44; 20 బంతుల్లో 4 ఫోర్లు, 3 సిక్సులు) మెరుపులు మెరిపించాడు. సూర్యకుమార్ యాదవ్ (32), హార్దిక్ పాండ్య (25) పరుగులు చేశారు. సంజు శాంసన్ (10), ఇషాన్ కిషన్ (8), శివమ్ దూబె (9) నిరాశపర్చారు. సూర్యతో కలిసి అభిషేక్ మూడో వికెట్‌కు 99 పరుగుల భాగస్వామ్యం (47 బంతుల్లో) నెలకొల్పాడు. కివీస్ బౌలర్లలో జాకబ్ డఫీ 2, కైల్ జేమీసన్ 2, క్రిస్టియన్ క్లార్క్, ఇష్ సోధి, మిచెల్ శాంట్నర్ ఒక్కో వికెట్ సాధించారు. ఈ మ్యాచ్‌లో ఇరు జట్లు కలిపి 428 పరుగులు చేశాయి. భారత్, న్యూజిలాండ్ మధ్య జరిగిన టీ20ల్లో ఇదే అత్యధికం. తాజా ఇన్నింగ్స్‌తో అభిషేక్ శర్మ టీ20ల్లో 5,000 పరుగుల మార్కు అందుకున్నాడు. దీంతో రస్సెల్ (2942)ను అధిగమించి అతి తక్కువ బంతుల్లో (2898) ఈ ఘనత సాధించిన బ్యాటర్‌గా అభిషేక్ రికార్డు సృష్టించాడు.

# ఐసీసీ వన్డే ర్యాంకింగ్స్..

### నం.1 బ్యాటర్‌గా డారిల్ మిచెల్.. రెండో స్థానంలో కోహ్లీ





ఐసీసీ తాజాగా విడుదల చేసిన వన్డే ర్యాంకింగ్స్‌లో న్యూజిలాండ్ బ్యాటర్ డారిల్ మిచెల్ నం.1 స్థానాన్ని కైవసం చేసుకున్నాడు. అతడి ఖాతాలో 845 పాయింట్లున్నాయి. ఇంతకు ముందు మొదటి స్థానంలో ఉన్న విరాట్ కోహ్లీ 795 పాయింట్లతో రెండో స్థానానికి పడిపోయాడు. న్యూజిలాండ్ సిరీస్‌లో విఫలమైన రోహిత్ శర్మ మూడో స్థానం నుంచి నాలుగో స్థానానికి పడిపోయాడు. ప్రస్తుతం అతడి ఖాతాలో 757 పాయింట్లున్నాయి. మూడో స్థానంలో 764 పాయింట్లతో అఫ్గానిస్థాన్ బ్యాటర్ ఇబ్రహీం జద్రాన్ నిలిచాడు. శుభ్‌మన్ గిల్ 723 పాయింట్లో అయిదో స్థానంలో ఉన్నాడు. కేఎల్ రాహుల్ (670 పాయింట్లు) పదో, శ్రేయస్ అయ్యర్ (656) 11వ స్థానాల్లో కొనసాగుతున్నారు. ఇటీవల భారత్, న్యూజిలాండ్ మధ్య జరిగిన మూడు వన్డేల సిరీస్‌లో కివీస్ బ్యాటర్ డారిల్ మిచెల్ 176.00 యావరేజ్‌తో 352 పరుగులు చేసిన విషయం తెలిసిందే. ఇందులో రెండు భారీ సెంచరీలు (137, 131), ఒక హాఫ్‌సెంచరీ (84) ఉన్నాయి. విరాట్ కోహ్లీ 80.00 యావరేజ్‌తో 240 పరుగులు చేశాడు. ఇందులో ఒక సెంచరీ (124), ఒక హాఫ్ సెంచరీ (93) ఉన్నాయి. రాజ్‌కోట్ వేదికగా జరిగిన రెండో మ్యాచ్‌లో కోహ్లీ (24) బ్యాటింగ్‌లో విఫలమయ్యాడు. మొత్తం మీద దాదాపు నాలుగు సంవత్సరాల తర్వాత నం.1 ర్యాంక్‌ను సొంతం చేసుకున్న విరాట్ కొన్ని రోజుల వ్యవధిలోనే రెండో స్థానానికి పడిపోయాడు. టీ20 బ్యాటింగ్ ర్యాంకింగ్స్‌లో అభిషేక్ శర్మ 908 పాయింట్లతో మొదటి, తిలక్ వర్మ (805 పాయింట్లు) మూడో స్థానంలో ఉన్నారు. టెస్ట్ ర్యాంకింగ్స్‌లో 880 పాయింట్లతో ఇంగ్లాండ్ బ్యాటర్ జో రూట్ తొలి, యశస్వి జైస్వాల్ (750 పాయింట్లు) ఎనిమిదో, శుభ్‌మన్ గిల్ (730 పాయింట్లు) పదో స్థానంలో ఉన్నారు. టెస్ట్ బౌలింగ్ ర్యాంకింగ్స్‌లో బుమ్రా (879 పాయింట్లు), టీ20ల్లో వరుణ్ చక్రవర్తి (804), వన్డేల్లో రషీద్ ఖాన్ (710 పాయింట్లు) తొలిస్థానాల్లో నిలిచారు.



# టీ20 ప్రపంచ కప్..

### అది వింత అనుభవం అవుతుంది : రోహిత్ శర్మ

తొలిసారి టీ20 ప్రపంచ కప్‌నకు దూరం కావడంపై భారత స్టార్ బ్యాటర్ రోహిత్ శర్మ ఎమోషనల్ అయ్యాడు. మొదటిసారి టీ20 వరల్డ్ కప్ మ్యాచ్‌లను ఇంట్లో కూర్చొని చూడటం తనకు వింత అనుభవం అవుతుందన్నాడు. ప్రస్తుతం రోహిత్ టెస్టులు, టీ20లకు వీడ్కోలు పలికి వన్డేలు మాత్రమే ఆడుతున్న సంగతి తెలిసిందే. ఫిబ్రవరి 7 నుంచి 2026 టీ20 ప్రపంచ కప్ మొదలుకానుండటంతో హిట్‌మ్యాన్ గత జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నాడు. "టీ20 ప్రపంచ కప్ గురించి మేం ఇంట్లో మాట్లాడుకుంటున్నాం. ఇంట్లో కూర్చొని మ్యాచ్‌లు చూడటం వింత అనుభవం. ఈ టోర్నీ ప్రారంభమైనప్పటి నుంచి ఇప్పటివరకు నేను ప్రతి ప్రపంచ కప్‌లో భాగమయ్యాను. కాబట్టి.. ఇది భిన్నంగా అనిపిస్తుంది. వరల్డ్ కప్‌ను మిస్ అయినప్పుడు మనం అందులో ఆడట్లేదు కదా అని గుర్తొస్తుంది" అని రోహిత్ పేర్కొన్నాడు. తన కెప్టెన్సీ ప్రయాణం గురించి మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరిని సంతోష పెట్టలేమని.. ప్రపంచ కప్‌లకు ముందు కొన్ని కఠినమైన నిర్ణయాలు తీసుకోక తప్పదన్నాడు. 2007 మొట్టమొదటి ఎడిషన్ నుంచి 2024 వరకు జరిగిన తొమ్మిది ప్రపంచ కప్‌ల్లో హిట్‌మ్యాన్ ఆడాడు. బంగ్లాదేశ్ ఆటగాడు షకీబ్ అల్ హసన్, రోహిత్ మాత్రమే అన్ని ఎడిషన్లలో ఆడటం విశేషం. గత ఎడిషన్‌లో రోహిత్ సారథ్యంలో భారత్ ఛాంపియన్‌గా నిలిచిన సంగతి తెలిసిందే.



# పసిడి పరుగులు..

### ఒక్కరోజే రూ.9వేలకు పైగా పెరిగి..

బంగారం, వెండి ధరల పరుగు ఆగట్లేదు. రోజురోజుకీ పెరుగుతూ కొత్త రికార్డులను అధిగమిస్తున్నాయి. ఇప్పటికే రూ.లక్షన్నర దాటిన మేలిమి (24 క్యారెట్లు) బంగారం 10 గ్రాముల ధర బుధవారం మరింత పెరిగింది. హైదరాబాద్ మార్కెట్‌లో నేటి ఉదయం 11.45 గంటల సమయంలో పసిడి ధర ఏకంగా రూ.1.61 లక్షలు పలికింది. క్రితం రోజుతో (రూ.1,52,800) పోలిస్తే దాదాపు రూ.9వేలు పెరగడం గమనార్హం. ఇక, 22 క్యారెట్ల బంగారం ధర రూ.1,41,900కు చేరింది. మరోవైపు, వెండి ధర కూడా దూసుకెళ్తోంది. నేటి మార్కెట్‌లో కిలో వెండి ధర రూ.3,30,000గా ఉంది. క్రితం రోజుతో పోలిస్తే ఇవాళ వెండి ధర దాదాపు రూ.14వేలు పెరిగింది. అంతర్జాతీయ మార్కెట్‌లో ఈ లోహాల ధరలు జోరుగా పెరుగుతున్నాయి. ఔన్సు వెండి ధర చరిత్రలో తొలిసారి 94 డాలర్ల మార్క్‌ను దాటి పయనిస్తోంది. ఇక ఔన్సు బంగారం ధర 4,849 డాలర్లను చేరింది. గ్రీన్‌లాండ్ స్వాధీనానికి, గాజా శాంతిమండలిలో సభ్యత్వానికి సహకరించడం లేదంటూ ఐరోపా దేశాలపై, ఫ్రాన్స్‌పై అమెరికా అధ్యక్షుడు ట్రంప్ భారీ సుంకాలను ప్రకటించారు. దీంతో అంతర్జాతీయంగా వాణిజ్య యుద్ధ భయాలు పెరిగాయి. ఈ పరిణామాల నేపథ్యంలో బంగారం, వెండిని మదుపర్లు సురక్షిత పెట్టుబడి సాధనాలుగా భావించడంతో వీటి ధరలు గణనీయంగా పెరుగుతున్నాయని బులియన్ మార్కెట్ విశ్లేషకులు చెబుతున్నారు. మరోవైపు కొత్త ఇంధన రంగాలు, విద్యుత్తు వాహనాల తయారీ రంగాల నుంచి వెండికి గిరాకీ అంతకంతకూ పెరుగుతుండడంతో దానికి విపరీతంగా డిమాండ్ ఏర్పడింది.



# మాపై భారీగా పన్నులేయండి

### 400 మంది సంపన్నుల డిమాండ్

భవిష్యత్ ప్రణాళికలు వేసుకుంటూ, కొత్త అవకాశాలను వెతుక్కుంటూ ప్రతిఏటా దావోస్‌లో జరిగే ప్రపంచ ఆర్థిక సదస్సుకు (డబ్ల్యూఈఎఫ్) వ్యాపారవేత్తలు వస్తుంటారు. ఈ నేపథ్యంలో 400 మంది సంపన్నులు వినూత్న డిమాండ్ చేశారు. తమపై భారీగా పన్నులు విధించాలని ఇచ్చిన పిలుపు ఆశ్చర్యపరుస్తోంది. 24 దేశాలకు ప్రాతినిధ్యం వహిస్తోన్న ఈ బృందం.. "టైం టు విన్" పేరిట సంతకాలు చేసిన బహిరంగ లేఖను విడుదల చేశారు. సూపర్ రిచ్ వ్యక్తులకు, మిగతా మానవాళికి మధ్య అంతరం నానాటికీ పెరుగుతోందని హెచ్చరించారు. దానిని రూపుమాపాలంటే ధనవంతులపై అత్యధిక పన్నులు విధించాలన్నారు. ప్రజా జీవితం, రాజకీయ వ్యవస్థలను సంపన్నులు ప్రభావితం చేస్తున్నారని ఆందోళన వ్యక్తంచేశారు. ఈ భారీ సంపద ప్రజాస్వామ్య వ్యవస్థలను బలహీనపరుస్తోందని, ప్రజల విశ్వాసాన్ని దెబ్బతీస్తోందన్నారు. "భారీ సంపద కలిగిన కొందరు మన ప్రజాస్వామ్యాలను కొనుగోలు చేశారు. ప్రభుత్వాలను స్వాధీనం చేసుకున్నారు. మీడియా స్వేచ్ఛను హరించారు. ఆవిష్కరణలపై పట్టు బిగించారు" అంటూ ఆవేదన వ్యక్తంచేశారు. "అసలుసిసలైన ప్రజాస్వామ్య వ్యవస్థలను తిరిగి కోరుకుంటున్నాం. ఆ దిశగా ప్రగతిశీల సంపద పన్నులు విధించాలి. ఈ పన్నులతో కుబేరుల జీవన ప్రమాణాలు ఏమాత్రం పడిపోవు. పైగా ఆరోగ్యం, విద్య వంటి ప్రజాసేవలకు మరిన్ని నిధులు అందుతాయి" అని ఆ లేఖలో పేర్కొన్నారు. భారతదేశంలో సూపర్ రిచ్ వ్యక్తులపై పన్నులు పెంచాలనే ప్రతిపాదనలు, చర్చలు ఉన్నాయి. మన దేశంలో ప్రజల మధ్య అత్యధిక స్థాయిలో ఆదాయ అసమానతలు ఉన్నాయని ఫ్రాన్స్ ఆర్థికవేత్త, 'క్యాపిటల్ ఇన్ 21వ సెంచరీ' పుస్తక రచయిత థామస్ పికెట్టీ గతంలో వ్యాఖ్యానించారు. దీనిని నివారించాలంటే దేశంలో ఉన్న సూపర్ రిచ్ వ్యక్తులపై అధికంగా పన్నులు విధించాలని సూచించారు.



## నష్టాలతో ముగిసిన
# స్టాక్ మార్కెట్ సూచీలు

**ముంబయి:** దేశీయ స్టాక్‌మార్కెట్ సూచీలు మోస్తరు నష్టాలతో ముగిశాయి. భౌగోళిక ఉద్రిక్తతలు, వాణిజ్య అనిశ్చిత పరిస్థితులు మార్కెట్ సెంటిమెంట్‌ను దెబ్బతీశాయి. ఓ దశలో సెన్సెక్స్ వెయ్యికి పైగా పాయింట్లు నష్టపోగా.. మధ్యాహ్నం తర్వాత మళ్లీ లాభాల్లోకి వచ్చింది. చివరికి నష్టాలతో ముగిసింది. నిఫ్టీ కూడా ఇంట్రాడేలో 25,100 దిగువకు చేరింది. రోజంతా లాభనష్టాలు కొనసాగాయి. సెన్సెక్స్ ఉదయం 81,794.65 పాయింట్ల వద్ద (క్రితం ముగింపు 82,180.47) నష్టాల్లో ప్రారంభమైంది. ఇంట్రాడేలో 81,124.45 వద్ద కనిష్ఠాన్ని తాకింది. చివరికి 270.84 పాయింట్ల నష్టంతో 81,909.63 వద్ద ముగిసింది. నిఫ్టీ సైతం 75 పాయింట్ల నష్టంతో 25,157.50 వద్ద స్థిరపడింది. డాలరుతో రూపాయి మారకం విలువ జీవనకాల కనిష్ఠస్థాయి 91.73కు చేరింది. సెన్సెక్స్ 30 సూచీలో ఐసీఐసీఐ బ్యాంక్, ట్రెంట్, బీఈఎల్, యాక్సిస్ బ్యాంక్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ షేర్లు ప్రధానంగా నష్టపోయాయి. ఎటెర్నల్, అల్ట్రాటెక్ సిమెంట్, ఇండిగో, రిలయన్స్, అదానీ పోర్ట్స్ షేర్లు లాభపడ్డాయి. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 64.33 వద్ద కొనసాగుతుండగా.. బంగారం ఔన్సు 4,862 డాలర్ల వద్ద ట్రేడవుతోంది.

రాజముద్ర
ప్రతి అక్షరం - ప్రజల కోసం · తెలుగు దిన పత్రిక
www.rajamudranews.com



## షాహిద్, తృప్తి దిమ్రిల ఓ రోమియో

బాలీవుడ్ వెండితెరపై మరో క్రేజీ కాంబినేషన్ సందడి చేయబోతోంది. స్టార్ హీరో షాహిద్ కపూర్, సెన్సేషనల్ బ్యూటీ తృప్తి దిమ్రి జంటగా నటిస్తున్న భారీ యాక్షన్ రొమాంటిక్ డ్రామా 'ఓ రోమియో'. ఈ చిత్రం వాలెంటైన్స్ డే కానుకగా ఫిబ్రవరి 13న ప్రేక్షకుల ముందుకు రాబోతుంది. గతంలో 'కమినే', 'హైదర్', 'రంగూన్' వంటి క్లాసిక్ చిత్రాలను అందించిన టాలెంటెడ్ డైరెక్టర్ విశాల్ భరద్వాజ్ నాలుగోసారి షాహిద్ కపూర్‌తో జతకడుతుండటంతో ఈ సినిమాపై భారీ అంచనాలు నెలకొన్నాయి. ప్రముఖ నిర్మాత సాజిద్ నడియాద్వాలా ఈ సినిమాను నిర్మిస్తున్నాడు. సినిమా విడుదల తేదీ దగ్గరపడటంతో మూవీ నుంచి ట్రైలర్‌ను విడుదల చేసింది చిత్రయూనిట్. తాజాగా విడుదలైన ఈ సినిమా ట్రైలర్ సినీ ప్రియులను విశేషంగా ఆకట్టుకుంటోంది. ముంబై అండర్ వరల్డ్ బ్యాక్‌డ్రాప్‌లో సాగే పవర్‌ఫుల్ క్రైమ్ అండ్ లవ్ స్టోరీగా ఈ చిత్రాన్ని తెరకెక్కించినట్లు ట్రైలర్ చూస్తే అర్థమవుతోంది. ముఖ్యంగా షాహిద్ కపూర్ మునుపెన్నడూ లేని విధంగా అత్యంత భయంకరమైన 'వైల్డ్' లుక్‌లో కనిపిస్తూ షాక్ ఇచ్చారు. ఒళ్లంతా టాటూలు, రక్తపు మరకలతో ఉన్న ఆయన లుక్ ప్రస్తుతం వైరల్‌గా మారింది. ఈ చిత్రంలో తృప్తి దిమ్రితో పాటు నానా పటేకర్, అవినాష్ తివారీ, విక్రాంత్ మస్సే, దిశా పటానీ వంటి హేమాహేమీలు కీలక పాత్రల్లో నటిస్తున్నారు. మిల్కీ బ్యూటీ తమన్నా భాటియా ఒక ప్రత్యేక పాత్రలో మెరవనుండటం సినిమాకు మరో ప్రధాన ఆకర్షణగా నిలవనుంది

# 'భగవంత్ కేసరి' ఇంకా హిట్ కావాల్సింది

## అనిల్ రావిపూడి

దర్శకుడు అనిల్ రావిపూడి 'మన శంకర వరప్రసాద్ గారు' విజయాన్ని ప్రస్తుతం ఎంజాయ్ చేస్తున్నారు. ఈ సంక్రాంతికి వచ్చిన ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ రోజుకో కొత్త రికార్డును తన ఖాతాలో వేసుకుంటోంది. ఈ సినిమా ప్రచారంలో భాగంగా ఇటీవల ఓ ఇంటర్వ్యూలో అనిల్ గతంలో తాను దర్శకత్వం వహించిన 'భగవంత్ కేసరి' గురించి మాట్లాడారు. అది ఇంకా పెద్ద విజయం సాధించాల్సిన చిత్రమని అభిప్రాయపడ్డారు. "బాలకృష్ణతో నేను ఎవరూ ఊహించనివిధంగా సినిమా చేయాలనుకున్నాను. నా కెరీర్‌లో కష్టపడి రాసుకున్న స్క్రిప్ట్‌లలో అదీ ఒకటి. కానీ, ఆ సినిమా ఇంకా హిట్ కావాల్సింది. అది విడుదలైనప్పుడు చంద్రబాబునాయుడు జైలులో ఉండడంతో బాలయ్య అభిమానులు చాలామంది నిరాశకు గురయ్యారు. సాధారణ ప్రేక్షకులు దాన్ని చూసి ఆదరించి హిట్ చేశారు. పరిస్థితులు బాగుండి ఉంటే దానికి ఇంకా ఆదరణ దక్కేది" అని అనిల్ రావిపూడి అన్నారు. అయితే, విజయ్ హీరోగా రానున్న 'జన నాయగన్' స్క్రిప్ట్ విషయంలో తాను సాయం చేశాక ఆ నిరాశ నుంచి కొంత బయటకు వచ్చినట్లు చెప్పారు. బాలకృష్ణ హీరోగా అనిల్ రావిపూడి దర్శకత్వంలో 'భగవంత్ కేసరి' తెరకెక్కింది. 2023 అక్టోబర్ 19న విడుదలైన ఈ సినిమా ఆదరణ సొంతం చేసుకుంది. ఈ సినిమా 71వ జాతీయ చలన చిత్ర అవార్డుల్లో ఉత్తమ చిత్రంగా అవార్డును సొంతం చేసుకుంది.





### 'మన శంకర వరప్రసాద్ గారు'.. 'ఫ్లై.. హై' వీడియో సాంగ్ వచ్చేసింది



'మన శంకరవరప్రసాద్ గారు'లో చిరంజీవి మేనకోడలు నైరా పాడిన 'ఫ్లై.. హై' వీడియో సాంగ్‌ను చిత్రబృందం రిలీజ్ చేసింది. ఈ పాట ప్రోమోను విడుదల చేసినప్పుడు అనిల్‌రావిపూడి ఈ పాట పాడింది చిరు సోదరి మాధవి కుమార్తె అని వెల్లడించారు. చిరంజీవి కథానాయకుడిగా అనిల్ రావిపూడి దర్శకత్వంలో వచ్చిన ఈ సినిమా విడుదలైన నాటి నుంచే రికార్డులు సొంతం చేసుకుంటోంది. తాజాగా 2026లో ఓవర్సీస్‌లో అత్యధిక వసూళ్లు సాధించిన చిత్రంగా నిలిచింది.



## పవన్ కల్యాణ్ అంత ధైర్యంగా ఎవరూ ఉండరు

### నిధి అగర్వాల్

తన సినిమాల విడుదల సమయాల్లోనే కాకుండా తరచూ ఇంటర్వ్యూల్లో పాల్గొంటూ పలు ఆసక్తికర విషయాలను పంచుకుంటూ ఉంటారు నటి నిధి అగర్వాల్. తాజాగా ఆమె ఓ పాడ్‌కాస్ట్‌లో పాల్గొని పవన్ కల్యాణ్ గురించి ఆసక్తికర కామెంట్స్ చేశారు. "పవన్ కల్యాణ్ ఎంతోమందికి దేవుడితో సమానం. ఆయనంటే అంత క్రేజ్ ఉంది. అలాంటి అభిమానం కొందరికి మాత్రమే సొంతం. ఆయన కూడా అభిమానులను అలానే చూసుకుంటారు. ఆయనతో కలిసి వర్క్ చేసేటప్పుడు నేను ప్రత్యక్షంగా చూశాను. కలిసిన అందరితో బాగా మాట్లాడతారు. 'హరిహర వీరమల్లు'కు వర్క్ చేసే సమయంలో చాలా మంది నా దగ్గరకు వచ్చి 'మీరు మా దేవుడితో వర్క్ చేస్తున్నారు' అని అనేవారు. ఆయన నుంచి చాలా విషయాలు నేర్చుకోవచ్చు. ఎప్పుడూ పాజిటివ్‌గా ఉంటారు. వందశాతం కష్టపడతారు. ఎలాంటి విషయాన్నైనా ధైర్యంగా చెబుతారు. నిజాయతీగా ఉంటారు. సినిమాలతో సంబంధం లేకుండా ప్రజలు ఆయన్ని ఇష్టపడతారు. భవిష్యత్తులో ఆయన ప్రధాని అయినా ఆశ్చర్యపడను" అని నిధి అన్నారు. ఇక కొన్ని రోజులుగా బాలీవుడ్‌లో చర్చనీయాశంగా మారిన నెగెటివ్ పీఆర్ వ్యవస్థ గురించి నిధి ప్రస్తావించారు. "ఒకరిని ఉన్నతస్థానాలకు తీసుకెళ్లడానికి కాకుండా.. తొక్కేయడానికి భారీగా డబ్బులు ఖర్చు చేస్తున్నారు. నటీనటులకు కూడా ఎమోషన్స్ ఉంటాయి. నెగెటివ్ ప్రచారం వల్ల మానసికంగా కుంగిపోతారు. వాళ్లతో పాటు వాళ్ల కుటుంబాలు కూడా ఎంతో బాధను అనుభవిస్తాయి" అని నిధి ఆవేదన వ్యక్తం చేశారు.

## అనుకున్న టైమ్‌కే వారణాసి విడుదల



సూపర్‌స్టార్ మహేశ్ బాబు ,దర్శకధీరుడు రాజమౌళి కలయికలో తెరకెక్కుతున్న భారీ ప్రాజెక్ట్ 'వారణాసి'పై ఇప్పటికే దేశవ్యాప్తంగా అంచనాలు భారీగా ఏర్పడ్డాయి. రెండు నెలల క్రితం హైదరాబాద్‌లో నిర్వహించిన గ్రాండ్ ఈవెంట్‌లో ఈ సినిమా టైటిల్‌ను అధికారికంగా ప్రకటించడంతో పాటు, విడుదల సంవత్సరాన్ని కూడా మేకర్స్ వెల్లడించారు. అయితే రాజమౌళి సినిమాలు అనుకున్న షెడ్యూల్‌కు కచ్చితంగా పూర్తవుతాయా అనే సందేహం ప్రేక్షకుల్లో కొత్తది కాదు. గత చిత్రాల అనుభవం నేపథ్యంలో, 'వారణాసి' నిజంగా 2027లో విడుదల అవుతుందా? అనే ప్రశ్నలు సోషల్ మీడియాలో గట్టిగానే వినిపించాయి. ఈ నేపథ్యంలో తాజాగా చిత్రబృందం మరోసారి స్పందించి, సినిమా 2027లోనే ప్రేక్షకుల ముందుకు వస్తుందని స్పష్టత ఇచ్చింది. ఈ ప్రకటనతో కొంతమంది అభిమానులు సంతోషం వ్యక్తం చేస్తుండగా, మరికొందరు మాత్రం ఇంకా సందేహాలు వ్యక్తం చేస్తున్నారు. ఉగాది లేదా శ్రీరామనవమి లాంటి పండుగ సీజన్‌లో సినిమా విడుదలయ్యే అవకాశముందని ఫ్యాన్స్ అంచనా వేస్తున్నారు. అయితే, ఇంకా ఏడాది మాత్రమే మిగిలి ఉండటంతో అంత భారీ ప్రాజెక్ట్‌ను ఆలోపు పూర్తి చేయగలరా అనే చర్చ కూడా జోరుగా సాగుతోంది. ఈ చిత్రంలో మహేశ్ బాబు సరసన గ్లోబల్ స్టార్ ప్రియాంక చోప్రా హీరోయిన్‌గా నటిస్తున్నారు. ఇది మహేశ్ కెరీర్‌లోనే కాకుండా, ప్రియాంకకు కూడా ఒక ప్రత్యేకమైన ఇండియన్ ప్రాజెక్ట్‌గా మారనుంది. విలన్ పాత్రలో మలయాళ నటుడు పృథ్వీరాజ్ సుకుమారన్ కనిపించనుండటం మరో హైలైట్. అంతేకాదు, సినిమాలో ఒక కీలక ఘట్టంలో మహేశ్ బాబు రాముడి పాత్రలో కనిపిస్తారని రాజమౌళి ఇప్పటికే వెల్లడించడంతో ఈ అంశంపై కూడా భారీ ఆసక్తి నెలకొంది. 'వారణాసి'ని టైమ్ ట్రావెల్ కాన్సెప్ట్‌తో, భారతీయ పురాణాలు, ఆధునిక సైన్స్‌ను మేళవిస్తూ రూపొందిస్తున్నారని సమాచారం. భారీ బడ్జెట్, అంతర్జాతీయ స్థాయి టెక్నికల్ టీమ్‌తో ఈ సినిమాను తెరకెక్కిస్తున్నట్లు తెలుస్తోంది. అందుకే అభిమానులు 'రిలీజ్ ఆలస్యమైనా పర్వాలేదు, కానీ ఇది లైఫ్‌టైమ్ ఎక్స్‌పీరియన్స్ మూవీ కావాలి' అంటూ సోషల్ మీడియాలో తమ అభిప్రాయాలను వ్యక్తం చేస్తున్నారు. మొత్తానికి, మేకర్స్ 2027 డేట్‌కు కట్టుబడి ఉన్నామని మరోసారి స్పష్టం చేసినప్పటికీ, ఈ సినిమా చుట్టూ ఉన్న క్యూరియాసిటీ మాత్రం రోజు రోజుకీ పెరుగుతూనే ఉంది. 'వారణాసి' ఎప్పుడు వచ్చినా, అది భారతీయ సినిమాకు మరో మైలురాయిగా నిలుస్తుందనే నమ్మకం అభిమానుల్లో బలంగా ఉంది.

## డెకాయిట్‌లో ముగిసిన మృణాల్ యాత్ర


టాలీవుడ్‌లో కంటెంట్‌కు ప్రాధాన్యం ఇచ్చే హీరోగా మంచి గుర్తింపు తెచ్చుకున్న అడివి శేష్ ప్రస్తుతం తన కెరీర్‌లో మరో కీలక దశలో ఉన్నాడు. వరుసగా విభిన్న కథలతో ప్రేక్షకులను ఆకట్టుకుంటూ వస్తున్న శేష్, ఇప్పుడు భారీ అంచనాల మధ్య తెరకెక్కుతున్న తన తాజా చిత్రం 'డెకాయిట్' తో మరోసారి బజ్ క్రియేట్ చేస్తున్నాడు. ఈ సినిమాకు సంబంధించిన తాజా అప్‌డేట్ అభిమానుల్లో మరింత ఆసక్తిని రేపుతోంది. ఈ చిత్రంలో కథానాయికగా నటిస్తున్న మృణాల్ ఠాకూర్ తనకు సంబంధించిన షూటింగ్‌ను పూర్తిగా ముగించుకుంది. ఈ విషయాన్ని చిత్రబృందం అధికారికంగా ప్రకటిస్తూ, సెట్స్‌లో తీసిన కొన్ని ప్రత్యేక ఫోటోలను సోషల్ మీడియాలో షేర్ చేసింది. టీమ్ మొత్తం కలిసి ఉన్న ఈ ఫోటోలు ప్రస్తుతం నెట్టింట వైరల్ అవుతున్నాయి. అడివి శేష్, మృణాల్ ఠాకూర్ కాంబినేషన్ ఇప్పటికే ప్రేక్షకుల్లో మంచి క్యూరియాసిటీని క్రియేట్ చేసింది. ఇద్దరూ నటనలో మంచి అనుభవం ఉన్నవాళ్లే కావడంతో, ఈ సినిమాలో భావోద్వేగ సన్నివేశాలు బలంగా ఉండబోతున్నాయనే టాక్ వినిపిస్తోంది. ఇటీవలే ఈ హై వోల్టేజ్ డ్రామాకు సంబంధించిన కీలక షెడ్యూల్‌ను పూర్తి చేసినట్లు సమాచారం. మృణాల్ షూటింగ్ ముగియడంతో, ఇకపై సినిమా పోస్ట్ ప్రొడక్షన్ పనులు మరింత వేగంగా సాగనున్నాయి. 'సీతారామం' సినిమాతో తెలుగు ప్రేక్షకులకు మరింత దగ్గరైన మృణాల్ ఠాకూర్, ఈ చిత్రంలో ఎలాంటి పాత్రలో కనిపించబోతుందన్నది ఆసక్తికరంగా మారింది. ఆమె పాత్ర కథలో కీలక మలుపులు తిప్పేలా ఉంటుందని చిత్ర వర్గాలు సూచిస్తున్నాయి. ఇదిలా ఉంటే, 'డెకాయిట్' రిలీజ్ డేట్‌పై కూడా మేకర్స్ స్పష్టత ఇచ్చారు. ఈ సినిమాను ఈ ఏడాది మార్చి 19న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా విడుదల చేయాలని నిర్ణయించారు. ఉగాది పండుగ సందర్భంగా థియేటర్లలోకి రానున్న ఈ చిత్రం, తెలుగు మరియు హిందీ భాషల్లో ఒకేసారి విడుదల కానుంది.



## సోషల్ మీడియా విమర్శలకు దూరం

### దురంధర్ మూవీపై సారా అర్జున్

ఇటీవల సంచలనం సృష్టించిన చిత్రం 'ధురంధర్' విజయం ఎంతటి హాట్ టాపిక్‌గా మారిందో.. ఇందులో ప్రధాన పాత్రలో నటించిన నటీనటుల మధ్య వయసు వ్యత్యాసం కూడా అంతే వైరల్ అయ్యింది. రణ్‌వీర్ సింగ్ , సారా అర్జున్ మధ్య 20 ఏళ్ల వయసు తేడా ఉండడంతో ఈ సినిమా టీజర్ వచ్చినప్పటినుంచే విమర్శలు మొదలయ్యాయి. తాజాగా దీనిపై సారా అర్జున్ ఓ ఇంటర్వ్యూలో మాట్లాడారు. తాను ఇలాంటి విషయాలు పట్టించుకోను అని అన్నారు. ఇవన్నీ సోషల్ మీడియాలో వచ్చిన విమర్శలే కదా.. నేను సామాజిక మాధ్యమాల్లో పెద్దగా యాక్టివ్‌గా ఉండను అన్నారు.



Printed, Published and Owned by **RAVU RAJITHA**, Printed at **KAKATHIYA PRINTERS**, LN Colony, Uppal IDA, Uppal. **Editor: RAVU NAGI REDDY**. **RAJAMUDRA PUBLICATIONS**, Peerzadiguda, Medchal - Malkajigiri Dist. Telangana - 98, **RNI NO : TELTEL/2024/86684**, Contact No :98484 83466 9182474575, MAIL ID: rajaamudranews@gmail.com